


వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

## వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

ఏలూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సుకు ఎన్నో జీవన సూత్రాలను తెలియజేసిన మహర్షి వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కె వెట్రిసెల్వి అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారని వాల్మీకి జీవితం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్.పుష్పలత, బీసీ వెల్ఫేర్ అధికారి టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



స్పిల్ వే వద్ద తగ్గిన వరద ఉధృతి

## తగ్గిన గోదావరి వరద

పోలవరం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి తగ్గింది. ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 4,11,238 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ఉదయం 6 గంటలకు స్పిల్‌వే ఎగువన 29.890 మీటర్లు ఉన్న నీటిమట్టం సాయంత్రానికి 29.550 మీటర్లకు తగ్గింది.

### జిల్లాలో 4.3 మి.మీ. వర్షపాతం

ఏలూరు సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడచిన 24 గంటల్లో 4.3 మిల్లీ మీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. ముసునూరు మండలంలో అత్యధికంగా 48.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండవల్లిలో 32.4, ముదినేపల్లిలో 9.8, పెదవేగిలో 9.6, ఏలూరు అర్బన్‌లో 6.4, ఏలూరు రూరల్‌లో 5.6, దెందులూరులో 3.6, కలిదిండిలో 2.2, చింతలపూడిలో 1.4, లింగపాలెంలో 1.2, కైకలూరు, పెదపాడులలో 0.6 మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది.

## కోర్టు విధులు బహిష్కరణ

### సీజేఐపై దాడికి న్యాయవాదుల నిరసన

ఏలూరు క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్‌కె గవాయ్‌పై న్యాయవాది దాడిని ఖండిస్తూ ఏలూరు బార్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం ఏలూరులోని అన్ని కోర్టుల విధులను న్యాయవాదులు బహిష్కరించారు. ఏలూరు బార్ అధ్యక్షుడు కోనే సీతారామ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని వారు ఖండించారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మూసేయాల్సిందే..!


- జిల్లాలో 8 ఎయిడెడ్ పాఠశాలలకు ముందస్తు నోటీసులు
- పాఠశాలలో కనీసం 40 మంది విద్యార్థులు ఉండాలి
- వచ్చే విద్యా సంవత్సరం వరకు గడువు
- విద్యార్థులు పెరగకుంటే మూసివేత

ఏలూరు అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కనీస సంఖ్యలో విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం సమాయత్తమైంది. పాఠశాలలో కనీసం 40 మంది విద్యార్థులు లేకుంటే రానున్న విద్యా సంవత్సరం (2026-27) నుంచి మూసివేస్తామని సంబంధిత కరస్పాండెంట్లకు నోటీసులు జారీచేసేందుకు జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. జిల్లాలో 22 ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. వీటిలో 8 ప్రాథమిక పాఠశాలల్లో కనిష్ఠంగా 15 మంది, గరిష్ఠంగా 31మంది విద్యార్థులున్నట్టు గుర్తించారు. వచ్చే విద్యా సంవత్సంలోగా విద్యార్థుల సంఖ్యను నిబంధనల మేరకు పెంచుకోవడానికి అవకాశం ఇస్తున్నామని, లేనిపక్షంలో పాఠశాలలను మూసివేస్తామని పాఠశాలల కరస్పాండెంట్లకు ముందస్తు నోటీసులు ఇచ్చారు. వచ్చేఏడాది కూడా కనీస సంఖ్యలో విద్యా ర్థులు లేకపోతే పాఠశాలను మూసివేసి, విద్యార్థులను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయడంతోపాటు రవాణా భత్యాన్ని చెల్లించే అవకాశం ఉంది. ఈ పాఠశాలల్లో బోధించే టీచర్లను కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తారు.

## నేడు వైఎస్ జగన్ భీమవరం రాక

భీమవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ బుధవారం భీమవరం రానున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు కుమారుడి వివాహ వేడుకలో పాల్గొంటారు. జగన్ తాడేపల్లి నుంచి హెలీక్యాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3.25 గంటలకు భీమవరం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 3.40 గంటలకు పెదఅమిరం రాధా కన్వెన్షన్ హాలులో జరిగే వివాహ వేడుక వద్దకు వెళతారు. తిరిగి సాయంత్రం 4.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి భీమవరం చేరుకుని, సాయంత్రం ఐదు గంటలకు హెలిక్యాప్టర్‌లో తాడేపల్లి పయనమవుతారు.





## రథోత్సవం

చిన వెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి రథోత్సవం వైభవంగా సాగింది. ఉభయదేవేరులతో స్వామివారిని తొళక్కం వాహనంపై మేళతాళాలు, అర్చకులు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ వాహనాన్ని అట్టహాసంగా రథం వద్దకు తోడ్కొని వచ్చారు. రథం క్షేత్ర పురవీధుల్లో తిరుగాడింది.

రథంలో కొలువుదీరిన శ్రీవారు



ప్రారంభిస్తున్న ఆలయ ధర్మకర్త నివృతరావు, ఈఈ భాస్కర్ తదితరులు

# నిద్రపోతున్న నిఘా!

## సరిహద్దు దాటుతున్న ఇసుక

ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఏలూరు జిల్లాలోని చింతలపూడి, జీలుగమిల్లి మీదుగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా తాడిపూడి నుంచి ఏలూరు జిల్లా అవసరాలకు కేటాయించిన 1.34లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకలో సింహభాగం తెలంగాణకు తరలిపోయింది. చెక్‌పోస్టులు లేకపోవడం, మైనింగ్ అధికారులు ఇసుక మాఫియాకు దారులు తెరిచేయడంతో ఇసుక తరలిపోతోంది. అక్రమార్కులకు కాసుల వర్షం కురుస్తోంది.



జీలుగుమిల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లోడు లారీలు

- చింతలపూడి, జీలుగుమిల్లి మీదుగా తెలంగాణకు అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

గోదావరి జిల్లాల ఇసుక నాణ్యమైనది కావడంతో నిర్మాణాలకు అధికంగా వినియోగిస్తారు. స్థానిక అవసరాలకు ఇసుక అందుబాటులో ఉండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. స్థానికుల ఆధార్ నంబర్లు, ఫోన్ నెంబర్లు సేకరించి ఇసుకను సరిహద్దులను దాటించేస్తున్నారు. ఇటీవల ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ వెట్రిసెల్వి నిఘా పెంచాలని ఆదేశించినా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇసుక స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు, పోలీస్ పహారా లేకుండా ఇసుక లోడు లారీలు సాగిపోతున్నాయి. దీనికి మైనింగ్, రెవెన్యూ శాఖల అండదండలున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా జీలుగుమిల్లిలో ఇసుకను తరలిస్తున్న 5 లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### రూట్ మారిందా..!

తెలంగాణ రాష్ట్రం నుంచి లారీలు తీసుకొచ్చి ఎవరు నింపుతున్నారనే కోణంలో మైనింగ్ అధికారులు దృష్టి పెట్టడం లేదు. అన్ని తెలంగాణ రిజిస్ట్రేషన్ వాహనాలే వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. చింతలపూడి మండలంలోని యర్రగుంటపల్లి మీదుగా తెలంగాణకు ఇసుక తరలిపోతుండగా, ఇప్పుడు జీలుగమిల్లి మీదుగా రూట్ మారింది. జీలుగుమిల్లి మండలంలో కామయ్యపాలెం, రాచన్నగూడెం, తాటాకులగూడెం (తెలంగాణ సరిహద్దు ప్రాంతాలు) మీదుగా ఇసుక తరలిపోతుంది. చెక్‌పోస్ట్ చాలా కాలం క్రితమే ఎత్తివేయడంతో అక్రమార్కులు రూట్ మార్చేశారు. చింతలపూడి ఇసుక పాయింట్ వద్ద నిల్వలు బయటకు వెళ్లకుండా అడ్డుకోవడంతో కొవ్వూరు మీదుగా టి.నరసాపురం, కామవరపుకోట మండలం మక్కినవారిగూడెం మీదుగా జీలుగుమిల్లి జాతీయ రహదారిపై తెలంగాణకు తరలిస్తున్నారు. జీలుగమిల్లి జాతీయ రహదారిపై చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తే ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టే అవకాశం ఉంది. జిల్లా అవసరాలకు కేటాయించిన ఇసుకను తరలిపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. వర్షాకాలం తర్వాత జిల్లాలో నిర్మాణాలకు అవసరం పెరుగుతుంది. నిఘా నిద్రపోవడంతో అక్రమార్కులు ఇసుకను అలవోకగా రాష్ట్రం దాటించేస్తున్నారు. అధికారులు ఇసుక అక్రమ తరలింపుపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. ఆర్టీఏ, రెవెన్యూశాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

### పోలీసుల అదుపులో 5 లారీలు

జీలుగుమిల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీలను ఎస్సై వి.క్రాంతి కుమార్ అదుపులోకి తీసుకున్నారు. జీలుగుమిల్లిలో సోమవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా కొవ్వూరు నుంచి తెలంగాణకు ఇసుక తరలిస్తున్న లారీలను గుర్తించారు. వాహనాల తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి ఇసుకు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. 5 లారీలను స్వాధీనం చేసుకుని ఎస్సై కేసు నమోదు చేశారు. కొవ్వూరు నుంచి జీలుగుమిల్లి వయా మక్కినవారిగూడెం యర్రగుంటపల్లి మీదుగా తెలంగాణకు ఇసుక తరలిస్తున్నట్లు కొందరు చెబుతున్నారు.



చాట్రాయిలో వరి కోత యంత్రంతో ధాన్యం మాసూలు

## ముమ్మరంగా వరి కోతలు

చాట్రాయి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో చాట్రాయి, బూరుగుగూడెం, ఆరుగొలనుపేట గ్రామాల్లో ఖరీఫ్ వరి కోతలు చేపట్టారు. 1010 రకం నెల రోజులు ముందే కోతకు రావటంతో మిషన్లతో మాసూలు చేస్తున్నారు. 75 కేజీల ధాన్యం బస్తా రూ.1300 ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగులో ఉన్న 1224 రకం వరి మరో 15 రోజుల్లో కోతకు వస్తుందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ వరి, రబీ మొక్కజొన్న పంట కూడా నెల ముందే చేతికి రావడంతో మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. రబీ మొక్కజొన్న క్వింటాలుకు రూ.300, 400 ధర వస్తుందని రైతులు చెబుతున్నారు.

శాయ్ సెంటర్‌పై మాయని మచ్చ 7

## గిరిజన గ్రామాల అభివృద్ధికి రూ.826.48 కోట్లు

- అంచనాలు రూపొందించిన అధికారులు
- మారనున్న గిరిజన గ్రామాల రూపురేఖలు
- 9 మండలాలు, 46 గ్రామాల్లో ముగిసిన గ్రామసభలు
- మౌలిక సదుపాయాలతో ప్రభుత్వానికి నివేదికలు

బుట్టాయగూడెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో కొండరెడ్డి గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. గిరిజనాభివృద్ధిలో భాగంగా ఆది కర్మయోగి పరివార్ అభియాన్ పథకానికి శ్రీకారం చుట్టాయి. 9 మండలాల్లో 46 కొండరెడ్డి గిరిజన గ్రామాల అభివృద్ధికి రూ.826.48 కోట్లతో అధికారులు అంచనాలు రూపొందించి కేంద్రానికి నివేదించారు. త్వరలో నిధులు కూడా విడుదల కానున్నాయని సమాచారం. పశ్చిమ ఏజెన్సీ బుట్టాయగూడెం మండలంలోని 19 గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.326.43 కోట్లు, వేలేరుపాడు మండలంలో 9 గ్రామాలకు రూ.123.15 కోట్లు, పోలవరంలో 5 గ్రామాలకు రూ.141.11 కోట్లు, జీలుగుమిల్లి 5 గ్రామాలకు రూ.54.15 కోట్లు, కుక్కునూరు 2 గ్రామాలకు రూ.3.53 కోట్లు, టి.నరసాపురంలో 1 గ్రామానికి రూ.17.92 కోట్లు, చాట్రాయిలో 1 గ్రామానికి రూ.43.30 కోట్లు, నూజివీడులో 2 గ్రామాలకు రూ.93.31 కోట్లు, చింతలపూడి మండలంలో 2 గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.17.55 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. మొత్తం 9 మండలాల్లోని 48 గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిచేయాలని లక్ష్యంతో నెల రోజులపాటు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను గుర్తించారు. ప్రతి గ్రామంలో రహదారులు, మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ కల్పన, గృహాల నిర్మాణం, చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు సహాయం, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, వ్యవసాయ అనుబంధ రంగాల బలోపేతం, యూనిట్లు పంపిణీ, సామాజిక పింఛన్లు, శాంతిభద్రతలు తదితర అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన గ్రామాల వారీగా విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అక్టోబరు 2తో గ్రామసభలు ముగియడంతో గిరిజనుల నుంచి క్షేత్రస్థాయిలో వచ్చిన సమస్యలు, అవసరాలతో గ్రామసభల ఆమోదంతో రూ.826.48 కోట్లతో అంచనాలు సిద్ధం చేసి అధికారులు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖకు పంపారు. పరిశీలన తర్వాత నిధులు విడుదల కానున్నాయని అధికారులు తెలిపారు. గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఖాయమని అందరూ భావిస్తున్నారు.





కొల్లేరుపై సమీక్షలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దండే, కలెక్టర్ వెట్రిసెల్వి

## కొల్లేరు ప్రజల మనోభావాలను సుప్రీంకు నివేదిస్తాం

- అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే
- నేడు వాదనలు వినిపించనున్న రాష్ట్ర ప్రభుత్వం..

ఏలూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా వారికి న్యాయం చేసే కోణంలో ప్రభుత్వానికి నివేదించి, తదుపరి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే అన్నారు. అటవీ, పర్యావరణ శాఖల ప్రత్యేక కార్యదర్శి శరవణన్‌తో కలిసి కలెక్టరేట్‌లో కొల్లేరు అంశంపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పర్యావరణవేత్త మృత్యుంజయరావు సుప్రీం కోర్టులో వేసిన ప్రజా ప్రయోజన వాజ్యం(పిల్) వేసిన నేపథ్యంలో బుధవారం సుప్రీం కోర్టులో ప్రభుత్వం వాదనలు వినిపించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శాఖల వారీగా అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దండే సమీక్షించారు. గత వరదల సమయంలో బుడమేరు నుంచి ఎక్కువ వరద నీరు కొల్లేరుకు చేరినా యుద్ధప్రాతిపదికన నీటిని మరలించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. కొల్లేరు ప్రజల మనోభావాలను సుప్రీం కోర్టుకు ప్రభుత్వం వివరిస్తుందన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో 10 మండలాల్లో కొల్లేరు ప్రాంతం ఉందని, ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. సమావేశంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, అటవీశాఖాధికారులు పి.మోహిని, విజయలక్ష్మి, కేవీ.రామలింగాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

### అధికారుల సహాయంతో పనులు



కొల్లేరులో అభివృద్ధి పనులు చేపట్టాం. బుడమేర వరద నీరు కొల్లేరులోకి పోటెత్తకుండా అధికారుల సహకారంతో చర్యలు తీసుకున్నాం. అభివృద్ధి పనులకు అటవీశాఖ అనుమతులు త్వరగా రావడం లేదు. ఈ విషయంలో మానవతా దృక్పథంతో ఆలోచించాలి.

- డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే, కైకలూరు

### కనీస సమాచారం ఇవ్వడం లేదు..



అటవీశాఖ మాతో సమన్వయంగా ఉండడం లేదు. కనీస సమాచారం చెప్పడం లేదు. కోమటిలంక గ్రామంలో చాలా సమస్యలున్నాయి. కొల్లేరు సమస్యలపై పోరాటంచేస్తే గత ప్రభుత్వం నాపై క్రిమినల్ కేసులు పెట్టింది. కొల్లేరు ఆపరేషన్‌లో 14వేల ఎకరాల భూములకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

- చింతమనేని ప్రభాకర్, ఎమ్మెల్యే, దెందులూరు

### ప్రభుత్వ భూముల్లో చెరువులు లేవు



మా నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో ఎక్కడా ఆక్వా చెరువులు లేవు. కూటమి ప్రభుత్వంలో కొల్లేరు ప్రాంత అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కోర్టు అనుమతులు అనుకూలంగా వచ్చేలా అధికారులు శ్రద్ధ చూపాలి.

పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

### నిరసన



పశ్చిమ ఏజెన్సీలో ఆయుధ డిపో ఏర్పాటుపై ఆదివాసీ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన సందర్భంగా ఐటీడీఏ వద్ద ఆందోళన చేపట్టారు. 7




» చిన్నపాటి పొరపాట్ల వల్లే కోల్పోతున్న ప్రాణాలు » ముందస్తు జాగ్రత్తలపై అధికారుల సూచనలు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దీపావళి వచ్చిందంటే బాణసంచా కాల్చి సంబరాలు చేసుకోవచ్చు అనుకుంటారు. కానీ ఆ సంబరాల మాటున ప్రమాదం పొంచి ఉందనే విషయం ప్రతీ ఏటా ఏదో ఒక చోట కనిపిస్తూనే ఉంది. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్లో ఈ ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. చిన్నపాటి నిబంధనలు పాటించక పోవడంతో నిండు ప్రాణాలు బలితీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీపావళి విక్రయదారులు, తయారీ దారులు అందరూ తప్పక నిబంధనలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా తయారీ కేంద్రాల్లో నిబంధనలు పాటించకపోవడం వల్ల చాలామంది ప్రాణాలు పోయిన సందర్భాలు ఉన్నాయి. పరిమితికి మించి బాణసంచా నిల్వలు పెట్టడం, తయారీ కేంద్రాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణతోపాటు అనుమతి లేని ప్రాంతాల్లో బాణసంచా గోదాములు ఏర్పాటు చేయడం తదితర కారణాలతో బాణసంచా వల్ల ప్రమాదాలు సంబవించిన సందర్భాలు కోకొల్లలు. వీటి నివారణకు ప్రభుత్వం, అధికారులు సూచనలు చేస్తున్నప్పటికీ చిన్నపాటి పొరపాట్ల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. వాటి కోసమే నిబంధనలు పాటించాలని ప్రభుత్వం, అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూనే ఉన్నారు.

**నిబంధనలు ఇవీ..**

- బాణసంచా తయారీ కేంద్రం, నిల్వ గోదాములకు, విక్రయ కేంద్రాలకు ప్రభుత్వ అధికారుల నుంచి లైసెన్స్‌లు తీసుకోవాలి.
- దీపావళి సమయంలో తాత్కాలికంగా విక్రయించే బాణసంచా దుకాణాలవారు తాత్కాలిక లైసెన్స్‌లు పొందాలి.
- బాణసంచా తయారీ కేంద్రమైనా.. విక్రయ కేంద్రమైనా, గోదాములైనా నివాస ప్రాంతాలకు, వ్యాపార కూడలికి దూరంగా ఏర్పాటుచేసుకోవాలి. అప్పుడే ప్రమాదం సంభవిస్తే ప్రాణ నష్టం ఉండదు.
- టపాసుల తయారీ, విక్రయ కేంద్రాల వద్ద నీరు, ఇసుక ఉంచాలి
- తయారీ భవనంలో విద్యుత్ కనెక్షన్ ఉండకూడదు. ప్రమాదం సంభవిస్తే కరెంట్ ఉంటే ప్రమాద తీవ్రత మరింత పెరుగుతుంది.
- 18 ఏళ్ల లోపు పిల్లలు బాణసంచా తయారీ, విక్రయాల వద్ద నిషేధం.
- బాణసంచా తయారీ ఇళ్లలో ఏర్పాటు చేయకూడదు.
- 125 డెసిబిల్స్ కంటే ఎక్కువ శబ్ధం ఉత్పత్తి చేసే బాణసంచా తయారీ నిషేధం.
- రాత్రి పది నుంచి ఉదయం ఆరు గంటల వరకు శబ్ధం విడుదల చేసే బాణసంచా పేల్చకూడదు.
- ఏ కంటైనర్‌లోనూ బాణసంచా పెట్టకూడదు.

**నిబంధనలు పాటించాల్సిందే..**



బాణసంచా తయారీ కేంద్రాల వద్ద నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. తయారీ కేంద్రాలు, దుకాణాల వద్ద తనిఖీలు చేసినప్పుడు నిబంధనలు పాటించనట్టు కనిపిస్తే కఠిన చర్యలు తప్పవు. తాడేపల్లిగూడెంలో తయారీ కేంద్రాలకు అనుమతులు ఇవ్వలేదు. నిబంధనలు పాటిస్తేనే అక్కడ అనుమతులు ఉంటాయి.

– మురళీ కొండబాబు
తాడేపల్లిగూడెం ఫైర్ ఆఫీసర్

**తనిఖీలు చేస్తున్నాం..**



తాడేపల్లిగూడెంలో అన్ని ప్రాంతాల్లోని బాణసంచా దుకాణాలు ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు పరిశీలించి, ఏదైనా సమస్య ఉందోలేదో తనిఖీలు చేస్తున్నాం. ఇప్పటికే ఫిర్యాదులు వచ్చిన బాణసంచా దుకాణాలను సీజ్ చేశాం. రెవెన్యూ, ఫైర్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం.

– ఆది ప్రసాద్, సీఐ
తాడేపల్లిగూడెం పట్టణం

## డీసీఎంఎస్‌లో బాణసంచా అమ్మకాలు : చాగంటి



నరసాపురం : ఉమ్మడి పశ్చిమ జిల్లాలో డీసీఎంఎస్ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ చెప్పారు. ఈ ఏడాది దీపావళికి డీసీఎంఎస్ ద్వారా సుమారు రూ.3 కోట్ల మేర వ్యాపారాన్ని చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భీమవరం, నిడదవోలు, ఏలూరుల్లో డీసీఎంఎస్ ద్వారా దీపావళి స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బయట మార్కెట్ కంటే బ్రాండెడ్ బాణసంచాన్ని తక్కువ ధరకు ఇస్తామన్నారు. వచ్చే ఏడాది ఈ వ్యాపారాన్ని జిల్లా అంతా విస్తరిస్తామని, రూ.15 కోట్లు వ్యాపారమే లక్ష్యమన్నారు.

**త్వరలో పప్పు నూనె అమ్మకాలు..**

ప్రజలకు స్వచ్ఛమైన కల్తీలేని లేని వస్తువుల్ని అందించాలనే లక్ష్యంతో త్వరలో ఏలూరులోని డీసీఎంఎస్ కార్యాలయంలో పప్పునూనె అమ్మకాలను ప్రారంభిస్తున్నామన్నారు. అవసరమైన మిషనరీని కొనుగోలు చేశామన్నారు. కస్టమర్ల సమక్షంలోనే నూనె ఆడించి తక్కువ ధరకు ఇస్తామన్నారు.

## టపాసుల తయారీలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి : కలెక్టర్, ఎస్పీ



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి

భీమవరం టౌన్ : దీపావళి టపాసుల తయారీ, అమ్మకాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిబంధనల మేరకు అధికారులు క ట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో దీపావళి టపాసుల తయ వారీ, అమ్మకాలకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి పలు శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపావళి పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోని విధంగా నిర్వహించుకునేలా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టాలని ఆదేశించారు. లైసెన్సు లేకుండా టపాసులు తయారుచేసినా.. అమ్మినా.. కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గతంలో లైసెన్సులు పొంది ప్రస్తుతం రెన్యువల్ కానీ మందు గుండు సామగ్రి తయారీ షెడ్లను క్షేత్రస్థాయిలో పోలీస్, రెవెన్యూ శాఖలు విధిగా తనిఖీచేసి ధ్రువీకరిం చాలన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ నిబంధనల మేరకు దీపావళి టపాసుల షాపులను నిర్వహించాలని, లోటుపాట్లు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. డీఆర్‌వో బి.శివన్నారా యణరెడ్డి, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో, దాసి రాజు, ఎస్‌బీ సీఐ వీవీఎన్ సత్యనారాయణ, డీపీవో రామనాథరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి తదితర అధికారులు పాల్గొన్నారు.



మాలధారణ చేసిన వారితో ప్రధానార్చకుడు మల్లికార్జున శర్మ

## 145 మంది మావుళ్లమ్మ మండల దీక్ష స్వీకరణ

భీమవరంటౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టే మావుళ్లమ్మ మండలదీక్షాధారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆశ్వీయుజ శుద్ధ మండల దీక్షా మాలధారణ వైభవంగా నిర్వహించారు. దాదాపు 145మంది భక్తులు అమ్మవారి దీక్షను తీసుకున్నారు. తొలుత ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ అమ్మవారి దీక్షను స్వీకరించారు. తదుపరి విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. మాల ధారులచే పూజా కార్యక్రమాలను చేయించి వారికి అమ్మవారి మాలతో దీక్షను అందించారు. దీక్ష తీసుకున్నంత సేపు భక్తులు అమ్మవారి నామస్మరణ చేయడంతో ఆలయ ప్రాంతం అంతా మార్మోగింది. దీక్షలు పూర్తయిన తరువాత అమ్మవారికి మహా హారతిని అందించారు దీక్ష నిమయ నిబంధనలు తెలిపారు.ఆలయ సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మి నగేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాలధారులతో ఆలయం కిటకిటలాడింది.

## శేషాచల వాసా.. శ్రీవేంకటేశా..

**చిన్నతిరుపతిలో అట్టహాసంగా శ్రీవారి రథోత్సవం**




ద్వారకాతిరుమల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సమ్మోహితమైన రూపం.. సుపరిచితమైన దరహాసంతో అభయ హస్తాన్ని ప్రసాదిస్తూ.. ఉభయనాంచారులతో రథవాహనంపై కొలువై పురవీధుల్లో విహరిస్తున్న కరుణాంతరంగుని వీక్షించిన భక్తులు పరవశించారు. చిన్నతిరుమలేశుని రథరంగ డోలోత్సవం క్షేత్రపురవీధుల్లో మంగళవారం రాత్రి అట్టహాసంగా జరిగింది.

కనకపు కొండవంటి రథంపై ధనుజ మర్ధనుడెక్కె రమణులతో.. అంటూ పదకవితా పితామహుడు అన్నమయ్య ఆలపించిన కీర్తనలు ఆవిష్కృతమయ్యాయి. శ్రీవారి ఆశ్వీయుజ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన రథవాహన సేవ భక్తజనులకు ఆద్యంతం కన్నులపండువైంది.

**రథోత్సవం జరిగిందిలా :**

శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం జరిగిన మరుసటి రోజున రథోత్సవాన్ని జరపడం ఇక్కడ సంప్రదాయబద్ధమైంది. స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు స్వామికి స్వయంగా సేవచేసుకునే భాగ్యం ఈ రథోత్సవం ద్వారానే కలుగుతుంది. రాత్రి ఆలయంలో ఉభయదేవేరులతో స్వామివారిని తొళక్కం వాహనంపై ఉంచి అలంకరించారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటభజనలు, అర్చకులు, ఆగమ విద్యార్థుల వేదమంత్రోచ్ఛరణల నడుమ వాహనాన్ని అట్టహాసంగా రథం వద్దకు తెచ్చారు. రథంలో ఏర్పాటుచేసిన సింహాసనంపై కల్యాణ మూర్తులను ఉంచి అలంకరించి హారతులిచ్చారు. ఆ తరువాత విశేష వాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, కోలాట భజనలు, భక్తుల గోవిలంద నామాల నడుమ క్షేత్రపురవీధుల్లో తిరుగాడింది. ఆలయ ఛైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు, ట్రస్టీ ఎస్వీ నివృతరావు, ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి తొలుత రథానికి బలిహరణ సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రథవాహనంలో కొలువైన శ్రీవారు, అమ్మవార్లను దర్శించి, రథసేవ చేసి తరించారు.



రాజమన్నార్ అలంకరణలో దర్శనమిస్తున్న చినవెంకన్న

## రాజమన్నార్‌గా శ్రీవారు

ద్వారకాతిరుమల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజమన్నార్ అలంకరణలో చిన వెంకన్న దర్శనం భక్తులకు నేత్రపర్వమైంది. ఆశ్వీయుజ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజుకో అలంకారంలో కటాక్షిస్తున్న స్వామి వారు మంగళవారం చంద్రకోలు, దండం ధరించి సర్వాభరణాలతో రాజమన్నార్‌గా భక్తులను అనుగ్రహించారు. స్వామిని పలువురు భక్తులు దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.






ఏలూరు జడ్పీ కార్యాలయం వద్ద నుంచి, భీమవరం నుంచి విజయవాడ ధర్నాకు తరలి వెళుతున్న ఉపాధ్యాయులు

## విజయవాడ ధర్నాకు తరలివెళ్లిన టీచర్లు

» 10 నుంచి బోధనేతర పనుల బహిష్కరణ » ప్రత్యక్ష పోరుబాటకు ఫ్యాప్టో తీర్మానం

ఏలూరు అర్బన్/భీమవరం రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు, పీఆర్సీ నియామకం, మధ్యంతర భృతి, తదితర డిమాండ్లతోపాటు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో నిర్వహించిన ధర్నాకు ఉమ్మడి పశ్చిమ జిల్లా నుంచి పెద్దసంఖ్యలో టీచర్లు తరలివెళ్లారు. విజయవాడ సమీపంలో ధర్నా నిర్వహించడంతో ఏలూరు జిల్లా నలుమూలల నుంచి కనీసం వెయ్యిమంది వస్తారని అంచనావేయగా, 800 మంది ఉపాధ్యాయులు ధర్నాకు హాజరయ్యారని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎస్, ఏసీపీఎస్ సంఘాల నుంచి 500 మందికి పైగా సంఘాల సభ్యులు పాల్గొన్నారని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పీఎస్ విజయరామరాజు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గడిచిన 16 నెలల కాలంలో ఎటువంటి చర్యలు చేపట్టనందున ఈనెల పదో తేదీ నుంచే మలివిడత ఆందోళనకు ధర్నాలో ఫ్యాప్టో సంఘాలన్నీ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు ప్రకటించారు. దీని కనుగుణంగానే అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు అన్నిరకాల బోధనేతర పనులను బహిష్కరిస్తారని, విద్యార్థులకు పాఠాలు బోధించడం మినహా ఇతర పనులేవీ చేయబోరని స్పష్టం చేస్తూ కలెక్టర్, డీఈవోలకు నోటీసును అందజేయనున్నామన్నారు. ఉదయం, సాయంత్రం పూటల్లో ప్రత్యేక తరగతులను తీసుకునేందుకు ఉద్దేశించిన విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కిస్తామని, సీపీఎస్‌పై సరైన నిర్ణయం చేయకుంటే జగన్ ప్రభుత్వంలో చేపట్టినట్టుగా మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. 12వ పీఆర్సీకి ఛైర్మన్‌ను నియమించాలని, 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా నుంచి ఫ్యాప్టో సభ్య సంఘాల నాయకుల్లో వెంకటేశ్వరరావు, ప్రకాష్, రవికుమార్, శామ్యూల్, రెడ్డిదొర, శివరామ్, రమేష్‌కుమార్, రామారావు, పవన్‌కుమార్, కాంతారావు, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మురళీకృష్ణ, రవీంద్ర, తదితరులున్నారు. భీమవరంలో ఫ్యాప్టో కార్యదర్శి జి.ప్రకాశం, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ రామరాజు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశం, ఏపీసీపీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, డీటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

**ఏలూరు జిల్లాలో 1,255 మంది టీచర్లు సెలవు నమోదు !**

ఏలూరు అర్బన్:విజయవాడలో జరిగిన ధర్నాకు ఎంతమంది హాజరైందీ, ఆ మేరకు ఎంతమంది అధికారికంగా సెలవు నమోదు చేశారనే దానిపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీశాయి. ఏలూరు జిల్లాలో మొత్తం 7,523మంది ఉపాధ్యా యులు పనిచేస్తుండగా, వీరిలో మంగళవారం 1,255 మంది క్యాజువల్ లీవు (సీఎల్) పెట్టినట్టు అధికారికంగా ధ్రువపడింది.

## అక్కడ రూ.2 ఇక్కడ రూ.30

» టమాటా ధరలపై వ్యాపారుల మాయాజాలం

తాడేపల్లిగూడెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : టమాటా పండించిన రైతుకు కన్నీరే మిగిలింది. ఆరుగాలం కష్టించిన రైతుకు ధరలు లేక అయినకాడికి అమ్ముకోవాల్సి వచ్చింది. ఇదే అదునుగా హోల్‌సేల్ వ్యాపారుల నుంచి రిటైల్ వ్యాపారుల వరకు దోచుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టమాటా పండించిన రైతు అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. పండించిన పంటను కొనేవారు లేక అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తుంది. ఇప్పుడు టమాటా మార్కెట్‌పై కార్పొరేట్ సంస్థలు కన్నేశాయి. తక్కువ ధరకు కొనేసి టమాటా సాస్‌ను, జ్యూస్‌ను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే అనంతపురం, మదనపల్లి మార్కెట్లో వీరి దందా జరుగుతున్నట్లు చెబుతున్నారు.

**టమాటా పండించే ప్రాంతాలు ఇవే..**

టమాటాను కర్ణాటకలోని కోలార్, ఆంధ్ర ప్రదేశ్‌లో చిత్తూరు జిల్లా మదనపల్లి పరిసర ప్రాంతాల్లోనూ, అనంతపురం పరిసర ప్రాంతాల్లోను ఎక్కువగా సాగుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట తడిసింది. ఈమేరకు నిల్వ ఆగే సామర్థ్యం తగ్గింది. వీటిని కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టేందుకు నాణ్యత తక్కువగా ఉండడంతో ఆ దిశగా అడుగులు పడడం లేదు. సాధారణంగా పండు టమాటా కోసిన తరువాత రెండు రోజుల్లో విక్రయాలు జరగాలి. అదే పచ్చిగా ఉన్న సమయంలో కోస్తే నాలుగు రోజులు నిల్వ సామర్థ్యం ఉంటుంది. ఇప్పుడు ఈ మూడు ప్రాంతాల్లో ఒకేసారి పంటదశకు టమాటా వచ్చింది. ఇబ్బడి ముబ్బడిగా మార్కెట్‌కు పంట చేరింది. అక్కడ కిలో రూ.2కు కొనుగోలు చేసిన టమాటా.. జిల్లాలోని మార్కెట్లలో ఆ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ట్రే (25 కిలోలు) రూ.500 నుంచి 600 మధ్య విక్రయిస్తున్నారు. ప్రతి ట్రేలోను మూడు నుంచి నాలుగు కిలోల టమాటాలు పనికి రాకుండా పోతాయని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. దీంతో వీటి ధర కిలో రూ.30 నుంచి 40 మధ్యన అమ్ముతున్నామని చెబుతు న్నారు. మదనపల్లి, అనంతపురం, కోలారు నుంచి జిల్లాకు రావాలంటే ట్రాన్స్‌పోర్టు ఖర్చులు ట్రేకు రూ.250 పడతాయని, దీనికి లోడింగ్, అన్‌లోడింగ్‌కు ట్రేకు రూ.40 ఖర్చుఅవుతుందని చెబుతున్నారు.



మార్కెట్‌లో మదనపల్లి టమాటాలు

దీంతో అక్కడ చౌకగా వచ్చిన ప్పటికీ ఇక్కడ ఈ ధరకే అమ్మితేగాని లాభాలు ఉండవని వ్యాపారులు తెగేసి చెబుతున్నారు. టమాటా తడిచిందంటే త్వరగా కుళ్లిపోయే స్వభావం ఎక్కువంటున్నారు. ట్రేలో ఉండే ఒక్క టమాటా కుళ్లితే పక్కనున్న టమాటాలు కూడా కుళ్లిపోతాయని అంటున్నారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొని కొనుగోలు చేసిన టమాటాలను సొమ్ములు చేసుకోవాల్సి వస్తుందని దీంతో ఇక్కడ ఈ ధరలు అమ్ముతున్నట్లు బహిరంగానే చెబుతున్నారు.



పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు



చించినాడ బ్రిడ్జిపై నడిచి వెళుతున్న విద్యార్థినులు

## తీరని 'చించినాడ' చింత

» నిలిచిన భారీ వాహనాల రాకపోకలు » విద్యార్థులు, వ్యాపారులకు తప్పని ఇబ్బందులు
» చుట్టూ తిరిగి వాహనాలు వెళ్లడంతో అధికమవుతున్న రవాణా వ్యయం

**రెండున్నర నెలలుగా జరుగుతున్న బ్రిడ్జి మరమ్మతులు**

యలమంచిలి, పాలకొల్లు టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలను అనుసంధానిస్తూ యలమంచిలి మండలం చించినాడ, మలికిపురం మండలం దిండి గ్రామాల మధ్య గోదావరి నదిపై ఉన్న చించినాడ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టేందుకు జూలై 25వ తేదీ నుంచి బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. సుమారు రెండున్నర నెలలుగా బ్రిడ్జిపై భారీవాహనాలు, బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో ముఖ్యంగా పలు కాలేజీలు, పాఠశాలల విద్యార్థులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు చించినాడ వరకు ఒక బస్సు, దిండి నుంచి మరో బస్సు ఏర్పాటుచేయడంతో విద్యార్థులంతా బ్రిడ్జిపై నడిచివెళుతున్నారు. ఇక వర్షం పడితే బ్రిడ్జి దాటడానికి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈమేరకు బ్రిడ్జి మరమ్మతులు పూర్తయితే అవస్థలు తప్పుతాయని విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఎదురుచూస్తున్నారు. హైవే కావడంతో ఈ బ్రిడ్జిపై అధికసంఖ్యలో భారీవాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండేవి. ముఖ్యంగా కొబ్బరి, ఆక్వా ఉత్పత్తులతో కూడిన లారీలు ఈ మార్గంలో అధికసంఖ్యలో రాకపోకలు సాగించేవి. ఈ వాహనాలను నిలిపివేయడంతో రావులపాలెం, ఈతకోట, సిద్ధాంతం మీదుగా చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి రావడంతో రవాణా వ్యయం ఎక్కువ అవుతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరగంటలో చేరాల్సిన గమ్యం సుమారు రెండుగంటల సమయం పడుతోందని ఆర్టీసీ బస్సుల ప్రయాణికులు వాపోతున్నారు.

**25 ఏళ్లలో అరకొరగా మరమ్మతులు**

ఎలాంటి బ్రిడ్జి నిర్మించినప్పటికీ సకాలంలో నిర్వహణ పనులు చేపట్టినప్పుడే ఆ నిర్మాణం పదికాలాల పాటు ఉపయోగపడుతుంది. సకాలంలో నిర్వహణ చేపట్టకుండా వదిలేయడం వల్లే ఈ బ్రిడ్జికి ఈ పరిస్థితి దాపురించిందని స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చించినాడ వద్ద గోదావరిపై రూ.150 కోట్ల నిధులతో బ్రిడ్జి నిర్మాణానికి 1995లో శంకుస్థాపన చేసి 2001 నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు బ్రిడ్జి నిర్వహణను గాలికొదిలేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. 25 ఏళ్లకాలంలో బ్రిడ్జిపై మార్గంలో ఒకటి, రెండుసార్లు.. అదీ అరకొరగా పైపై పూతలు వేశారు.. తప్ప పూర్తిస్థాయిలో నిర్వహణ పనులు చేపట్టిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. బ్రిడ్జిపై మార్గంలో ఇనుపచువ్వలు పైకితేలి.. ప్రమాదకరంగా ఉన్న గోతులను స్థానికులు పూడ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా స్పందించిన అధికారులు త్వరితగతిన మరమ్మతులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.




## నవంబరు నుంచి భారీ వాహనాలకు అనుమతి

**నరసాపురం :** చించినాడ వంతెన మరమ్మతు పనులు వేగంగా సాగుతున్నాయి. నవంబరు మొదటి వారంలో భారీ వాహనాలకు అనుమతి ఇవ్వాలని ఎన్‌హెచ్ అధికారులు యోచిస్తున్నారు. సంబంధిత పనులు చేపడుతున్న సంస్థతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జరుగుతున్న పనులపై ఎన్‌హెచ్ ఆరా తీసింది. వంతెనపై ధ్వంసమైన 52 బేరింగ్‌లు తీసివేసి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. వర్షం కారణంగా అనుకున్న స్థాయిలో ముందుకు సాగలేదు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఈనెలాఖరు నాటికి పూర్తి చేసి నవంబరులో మొదటి వారంలో భారీ వాహనాలను ఈ వంతెనపై అనుమతి ఇస్తామని ఎన్‌హెచ్ అధికారుల్లో ఒకరు ఆంధ్రజ్యోతికి చెప్పారు.

**మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేయాలి**



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కొబ్బరికాయలు కొనుగోలు చేసి లారీల్లో చించినాడ బ్రిడ్జి మీదుగా ఎగుమతి చేస్తుంటాము. సఖినేటిపల్లి, అమలాపురం, అంబాజీపేట, పి.గన్నవరం ప్రాంతాల్లో ఎగుమతైన లారీలు బ్రిడ్జి మరమ్మతుల కారణంగా రావులపాలెం మీదుగా తిరిగి రావాల్సి వస్తోంది. చుట్టూ తిరిగి రావడం వల్ల అధిక సమయంతో పాటు రవాణా వ్యయం ఎక్కువవుతోంది. బ్రిడ్జి మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తిచేయాలి.

– యాళ్ల సత్యనారాయణ
కొబ్బరి ఎగుమతిదారుడు, పాలకొల్లు.

## జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో
# శేషురిషిత్‌కు కాంస్య పతకం


శేషు రిషిత్ రెడ్డి

కాకినాడ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో ఇటీవల జరిగిన సీబీఎస్ఈ జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో సెబర్ సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో కాకినాడ లక్ష్య ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థి నల్లమిల్లి శేషు రిషిత్‌రెడ్డి కాంస్య పతకం సాధించినట్టు స్కూలు అధినేత డాక్టర్ ఎస్.సుగుణారెడ్డి తెలిపారు. ఫెన్సింగ్ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజీవ్‌మెహతా మాట్లాడుతూ సీబీఎస్ఈ జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో మొదటిసారిగా ఆంధ్ర నుంచి క్రీడాకారులు మంచి పోటీ ఇచ్చారన్నారు. విజేత శేషురిషిత్‌ను, ప్రిన్సిపాల్ వందనా బొహరాను, శిక్షకులు సతీష్, బేబీరెడ్డిలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఎన్.సుగుణారెడ్డి తదితరులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థినులతో ఎస్‌కేఎస్‌డీ కాలేజీ జాయింట్ సెక్రటరీ వెంకట కృష్ణారావు

## 'ఎస్‌కేఎస్‌డీ'లో అండర్-19 క్రీడా జట్ల ఎంపిక

తణుకు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోలతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో బాలికల క్రీడా జట్ల ఎంపిక పోటీలు తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా జూనియర్ కాలేజీలో నిర్వహించామని ప్రిన్సిపాల్ బీ. హిమబిందు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 200మంది విద్యార్థినులు పోటీలకు హాజరైతే 70మంది ఎంపికయ్యారని, వారిలో 25 మంది తమ కాలేజీ విద్యార్థినులు ఎంపికయ్యారన్నారు. చదరంగం, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్‌లకు పోటీలు జరిగాయన్నారు. ఎంపికైన విద్యార్థినులను కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా కార్యదర్శి జయరాజు, ప్రిన్సిపాల్స్ యు.లక్ష్మీసుందరీబాయ్, వీవీ సత్యనారాయణరెడ్డి, పీడీలు తారక మహాలక్ష్మి, రత్నకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## జేఎన్వీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల గడువు పెంపు


పెదవేగి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సుధీర్‌కుమార్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 21 వరకు గడువు పొడిగించామని, ఆసక్తి గల అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు 9వ తరగతికి సంబంధించి https://cbseitms.nic.in/2025/nvsix వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. 11వ తరగతికి దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు https://cbseitms.nic.in /2025/nvsxi వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.


ఏలూరు విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ శీలం

## జీఎస్టీ సంస్కరణలంతా సరికొత్త నాటకం

» మాజీ ఎంపీ జేడీ శీలం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణల పేరుతో సంబరాలు చేసుకోవడం.. ప్రజలను మభ్యపెట్టేందుకేనని, ఇదంతా ఒక కొత్త నాటకమని మాజీ ఎంపీ, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం, ఏఐసీసీ జాయింట్ కార్యదర్శి పాలక్‌వర్మ అన్నారు. ఏలూరులోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలకు ఏం మేలు జరుగుతుందని జీఎస్టీ సంస్కరణల పేరుతో సంబరాలు చేసుకుంటున్నారని బీజేపీ నేతలను ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పరిరక్షణగా రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా ఒంటరి పోరాటం కొనసాగిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో ఐదు సూత్రాలతో ప్రజల్లోకి వెళ్లి సంతకాల సేకరణ చేస్తున్నారన్నారు. ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అడ్డగోలుగా గద్దెనెక్కిందని, అనేక అవకతవకలకు పాల్పడిందన్నారు. దేశంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని, బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.


విత్తనాలు పంపిణీ చేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు

## 'పెరటి తోటలతో కుటుంబ భారం తగ్గుతుంది'

పోలవరం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి):పెరటితోటల పెంపకం ద్వారా కుటుంబాల నిర్వహణ భారం కొంత తగ్గుతుందని, అదనంగా వచ్చిన కూరగాయలతో కొంత ఆదాయం పెరిగి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని కృషి విజ్ఞాన కేంద్రం ఈ.రేఖ తెలిపారు. మంగళవారం పోలవరం మండలం ఎల్లండీపేట, కోంద్రుకోట పునరావాస కాలనీలలో తాడేపల్లి గూడెం కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు పెరటితోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పది రకాల పెరటితోటల విత్తనాలను, 186 పునరావాస కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలను ప్రత్యేకంగా న్యూఢిల్లీ నుంచి దిగుమతి చేసినట్టు తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త బి.పెదబాబు మాట్లాడుతూ భూమి సారపు పరీక్షలు నిర్వహించి, అవసరం మేరకు మందులు పిచికారీ చేయాలని అవగాహన కల్పించారు. మరో శాస్త్రవేత్త ఎ. దేవి మాట్లాడారు. ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనిల్‌కుమార్ గ్రామ పెద్దలు బొత్త ముక్కయ్య, గంగా రామలక్ష్మీదేవి, మిడియం కన్నపరాజు దొర, సున్నం రాజేష్, టి.రాజు, మిడియం సూర్యకాంతం, మూలెం కుమారి తదితరులు పాల్గొన్నారు.



# భూములు సిద్ధం

» వెంకట్రామన్నగూడెం, జగన్నపేటల్లో గుర్తింపు
» డీపీఆర్ బాధ్యత ప్రైవేటు ఏజెన్సీకి అప్పగింత
» విమానాశ్రయం ఏర్పాటులో మరో అడుగు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రభుత్వం ఫిజిబిలిటీ కమిటీ వేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో శ్రీకాకుళం, కుప్పం, ఒంగోలు, నాగార్జునసాగర్, తుని-అన్నవరం, తాడేపల్లిగూడెం, నెల్లూరులోని దగదర్తిలో విమానాశ్రయాల ఏర్పాటుకు 8500 ఎకరాలు అవసరమని అంచనా వేశారు. ఇందుకు రూ.1570.64 కోట్లు అవసరం. తాడేపల్లిగూడెం పరిధిలో వెంకట్రామన్నగూడెం, జగన్నపేట రెవెన్యూ గ్రామాల్లో భూములను జిల్లా అధికారులు గుర్తించారు. రెండు గ్రామాల్లోనూ 1123.06 ఎకరాలు అందు బాటులో ఉంది. ఈ మొత్తం భూసేకరణకు రూ.428.33 కోట్లు కానుంది. భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఇటీవల కలెక్టర్ నివేదిక ఇవ్వడంతో విమానాశ్రయ ఏర్పాటులో మరో అడుగు పడినట్టయ్యింది.

**తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు మరో అడుగు పడింది. వెంకట్రామన్నగూడెం, జగన్నపేట రెవెన్యూ భూములపై కలెక్టర్ నాగరాణి ప్రభుత్వానికి నివేదిక పంపారు. మొత్తం 1123 ఎకరాలు అందుబాటులో ఉన్నట్టు ఆమె స్పష్టం చేశారు. భూసేకరణకు ప్రభుత్వం రూ.428.33 కోట్లు కేటాయించింది. ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు నివేదిక వెళ్లింది. బ్యాంకు నుంచి రుణం తీసుకోవాల్సి ఉంటుంది. తదుపరి భూసేకరణ ప్రక్రియ ప్రారంభించనున్నారు.**



### భూవినియోగ మార్పిడి నిలిపివేత

విమానాశ్రయం వస్తుందన్న ఉద్దేశంతో భూవినియోగ మార్పిడి నిలిచి పోయింది. క్రయవిక్రయాలు జరగడం లేదు. ఆన్‌లైన్‌లో పేర్లు రావడం లేదు. ఇలా అన్ని విధాలా భూములపై అధికారులు కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయం ఏర్పాటైతే స్థానికులకు ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. రైతులకు నష్టం లేకుండా పరిహారం ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే బ్యాంకుల నుంచి రుణం తీసుకోవాలి. ఫిజిబిలిటీ కమిటీ నివేదిక ఇవ్వాలి. ఆ తర్వాత విమానా శ్రయ ప్రక్రియ ప్రారంభం కానుంది.

### డీపీఆర్ బాధ్యత ప్రైవేటు ఏజెన్సీకి అప్పగింత

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ప్రభు త్వం సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక ఇవ్వాలంటూ ప్రైవేటు ఏజన్సీకి బాధ్యతలు అప్పగించింది. ఈ కమిటీ నివేదిక కీలకం కానుంది. కలెక్టర్ నివేదిక వెళ్లింది. భూమి అందుబాటులో ఉన్నట్టు తేల్చారు. ఫిజిబిలిటీ కమిటీ రాక కోసం జిల్లా అధికారులు ఎదురుచూస్తున్నారు. వైఎస్ హయాంలో వేసిన కమిటీ గూడెంలో విమానాశ్రయం అవసరమని గుర్తించింది. లాభసాటిగా ఉంటుందని నివేదిక ఇచ్చింది. ఇప్పుడు కూడా అదే తరహాలో కమిటీ గుర్తించే అవకాశం ఉందని అంతా ఆశిస్తున్నారు. మొత్తం మీద తాడేపల్లి గూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు కలెక్టర్ నివేదికతో కదలిక వచ్చింది.


ఆందోళనకారుల్ని అదుపు చేస్తున్న పోలీసులు

# చెత్తపై సమరం

» నరసాపురంలో డంపింగ్‌ను అడ్డుకున్న స్థానికులు
» పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం
» అడ్డగించిన పోలీసులు.. అక్కడే చెత్త డంప్

నరసాపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 28వ వార్డు తుంగపాటి చెరువు వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఖాళీగా ఉన్న చెరువు స్థలంలో చెత్త వేయాలని మునిసిపల్ అధికారులు చేసిన ప్రయత్నాన్ని స్థానికులు అడ్డుకున్నారు. చెత్త ట్రాక్టర్లకు అడ్డంగా బైఠా యించి ఆందోళనకు దిగారు. దీంతో సీఐ యాదగిరి ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మొహరించారు. ముందుగా స్థానికులకు నచ్చజెప్పారు. తాత్కా లికంగానే చెత్త వేస్తున్నామని, త్వరలో మరో ప్రదేశంలో వేస్తామని హామీ ఇచ్చారు. స్థానికులకు ఇబ్బందులు లేకుండా చుట్టూ గోడ నిర్మిస్తామని చెప్పినా వారు ఆందోళన కొనసాగించారు. ఈ క్రమంలో అదనపు పోలీసు బలగాలు రావడంతో ఆందోళనకు దిగిన ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆందోళన చేస్తున్న వారిపై కూడా పెట్రోల్ పోసే యత్నం చేశాడు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు ఆందోళన కారులందరినీ టౌన్ స్టేషన్‌కు తరలించారు. మునిసిపల్ అధికారులు ట్రాక్టర్లను చెరువులోకి తీసుకుని చెత్త డంప్ చేయించారు.

ఇటీవల చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ పురపాలక సంఘానికి నోటీస్ జారీ చేసింది. గోదావరి ఒడ్డున్న ఉన్న చెత్తను మూడు నెలలో తొలగించాలని ఆదేశించింది. దీంతో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు అధికారులు పలు స్థలాలను పరిశీలించారు. అన్ని చోట్లా ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురైంది. ఇక 28 వార్డు ఖాళీ స్థలంలో వేయాలని నిర్ణయించగా.. అక్కడ కూడా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ధర్నాలు చేశారు. అయినప్పటికీ అధికా రులు మరో స్థలం లేకపోవడంతో తాత్కాలికంగా చెరువు స్థలంలో వేయా లని నిర్ణయించారు. మునిసిపల్ కమిషనర్ లేకపోవడంతో డీఈ ప్రసాద్, ఏఈ నవ్య, శానిటరీ సిబ్బంది దగ్గరుండి చెత్తను డంప్ చేయించారు.

# ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ గిరిజనుల ఆందోళన


గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషన్ సభ్యుడు, కలెక్టర్

బుట్టాయగూడెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో ఆయుధ డిపో నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం డిపో వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులు వివిధ రకాల పంటలను చేతపట్టుకుని కేఆర్ పురం ఐటీడీఏ ఎదుట ఆందోళన చేశారు. డిపో ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని రెండు పంటలు పండే భూముల్లో మాత్రమే వ్యతిరేకిస్తున్నామని, డిపోను ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేయాలని సాగులో ఉన్న వంకవారిగూడెం భూముల్లో వద్దని ఆందోళనకారులు తెలిపారు. ఏజెన్సీ పర్యటనలో ఉన్న జాతీయ ఎస్టీ కమిషన్ మెంబరు హుస్సేన్ నాయక్ ఆందోళనకారులతో మాట్లాడారు. డిపో ఏర్పాటుకు పీసా గ్రామసభ అనుమతి లేదని, గిరిజనులు వ్యతి రేకిస్తున్నా అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇంతలో పీవో కె.రాములు నాయక్ కలగజేసుకుని డిపో వేరే రాష్ట్రానికి వెళ్ళిపోతుంటే ఎమ్మెల్యే, ఎంపీ ప్రధానితో మాట్లాడి రాష్ట్రానికి తెచ్చారని, అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పడంతో గిరిజనులు పీవో మాటల్లో వాస్తవం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ సభ్యుడు గిరిజనులకు సర్దిచెప్పారు. డిపోను ఇక్కడ ఆదివాసీలు వ్యతిరేకిస్తున్నందున విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళతానని చెప్పడంతో గిరిజనులు శాంతించారు. పోరాట కమిటీ నాయకులు తెల్లం రామకృష్ణ, మడకం వెంకటేశ్వరావు, తెల్లం దుర్గారావు ఆదివాసీలు పాల్గొన్నారు.

### మౌలిక వసతులు కల్పించండి..

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మరింతగా మెరుగుపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ ఆదేశించారు. మంగళవారం కేఆర్ పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ చైర్మన్ వెట్రిసెల్వితో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొండ ప్రాంతాల్లోని

» మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలంటూ నినాదాలు
» కమిషన్ సభ్యుడు నాయక్ జోక్యంతో ఆందోళన విరమణ
» గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై హుస్సేన్ నాయక్ సమీక్ష

గిరిజనుల కదలికలపై ఆంక్షలు పెట్టవద్దని, గిరిజనులకు మంజూరు చేసిన 26 ఇళ్ళను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మోదేలు గ్రామానికి అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో చర్చించి పెదవాగు ప్రాజెక్టు మరమ్మతులకు చర్యలు చేపట్టాలన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ ఎస్టీ కమిషన్ పనిచేస్తుందని వారి హక్కులకు భంగం కలిగితే కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. మరో 6 నెలల్లో వస్తానని సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

● పెదవాగు ప్రాజెక్టు మరమ్మతుల పనులకు ప్రభుత్వానికి తెలంగాణ ఇరిగేషన్ అధికారులకు ప్రతిపాదనలు పంపామని, పోలవరం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కమిషన్ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, అధికారులు సతీష్‌రెడ్డి, జలగం ప్రసాదరావు, పివో కె.రాములు నాయక్, ఆర్డీవో ముక్కంటి, పోలవరం భూసేకరణ ప్రత్యేకకలెక్టర్ సరళా వందనం తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా

చింతలపూడి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):మద్యం మత్తులో వాహనం నడిపిన ముగ్గురికి రూ.పది వేలు జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి పి.మధుబాబు మంగళవారం తీర్పునిచ్చారని ఎస్ఐ కె.సతీశ్‌కుమార్ తెలిపారు. ఇటీవల మండలంలో ఎండపల్లి గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు ఉండడంతో వారిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసి మంగళవారం చింతలపూడి కోర్టుకు హాజరుపర్చగా జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు ఒక్కొక్కరికి పది వేల రూపాయల జరిమానా విధించారు. మరోసారి పట్టుబడితే జరిమానా, జైలుశిక్ష విధిస్తామని న్యాయమూర్తి హెచ్చరించారు.

### భీమడోలులో మరొకరికి 14 రోజుల జైలు..

భీమడోలు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనం నడిపిన ఒకరికి 14 రోజులు జైలు శిక్ష విధించినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. భీమడోలు పరిసర ప్రాంతాల్లో జాతీయ, రాష్ట్ర రహదారుల్లో మంగళవారం సీఐ యు.జె.విల్సన్, ఎస్ఐ సుధాకర్, సిబ్బంది డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. భీమడోలుకు చెందిన పూనూరి ప్రవీణ్ కుమార్ మద్యం మత్తులో మోటార్ సైకిల్ నడుపుతుండగా పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా 14 రోజులు జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ విల్సన్ హెచ్చరించారు.

## చింతలపూడిలో 10న వాహనాల వేలం

చింతలపూడి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్‌లోని నాలుగు మండలాల్లో సారా కేసుల్లో నాలుగు నెలల్లో పట్టుబడిన వివిధ రకాల వాహనాలను ఈ నెల 10న ఉదయం 9గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. ఆసక్తి గల వారు నిర్దేశించిన విలువలో పదోవంతు దరావతు సొమ్ముగా చెల్లించి వేలంలో పాల్గొనాలని, వేలం దక్కించుకున్న వారు 18 శాతం జీఎస్టీతో సొమ్మును అదే రోజు ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించాలన్నారు. ఏదైనా సందేహాలుంటే సర్కిల్ కార్యాలయంలో తెలుసుకోవాలని తెలిపారు.

## చికెన్ వ్యర్థాల వాహనం సీజ్.. ఐదుగురిపై కేసు



దెందులూరు, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చికెన్ వ్యర్థాల రవాణా చేసే వారిపై కేసులు నమెదు చేస్తామని దెందులూరు ఎస్ఐ ఆర్.శివాజీ హెచ్చరించారు. మంగళవారం దెందులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించారు. చికెన్ వ్యర్థాలతో హైదరాబాద్ నుంచి భీమడోలు వెళ్తున్న మినీ లారీని పోలీసులు గుర్తించి, సీజ్ చేశారు. చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న పెదపాడు మండలం తోటగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్, ఓనర్‌తో పాటుగా హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి, భీమడోలు మండలంలో చేపల చెరువులో చికెన్ వ్యర్థాలు వేసే వ్యక్తితో కలిపి మొత్తం ఐదుగురిపై కేసు నమెదు చేసి వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

## రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు పొడిగింపు

ఏలూరు క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తాత్కాలికంగా ప్రవేశపెట్టిన ప్రత్యేక రైళ్లను పొడిగిస్తూ విజయవాడ దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి నుంచి అనకాపల్లి వెళ్లే రైల్ నెంబర్ 07481ని నవంబరు 2 నుంచి 30వ తేదీ వరకు ప్రతి ఆదివారం నడపనున్నట్లు తెలిపారు. అనకాపల్లి నుంచి తిరుపతికి రైల్ నెంబర్ 07482ను నవంబరు 3 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకూ ప్రతి సోమవారం నడపనున్నట్లు తెలిపారు. ఈ రైళ్లు శ్రీకాళహస్తి, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి రైల్వే స్టేషన్లలో ఆగుతుందని తెలిపారు. ఈ రైళ్లల్లో ఏసీ, త్రి టైర్ కోచ్‌లు మాత్రమే ఉంటాయని తెలిపారు.

# శాయ్ సెంటర్‌పై మాయని మచ్చ..!

● పోక్సో కేసులో వినాయక ప్రసాద్
● బయటపడేందుకు విశ్వ ప్రయత్నాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):

క్రీడలు నేర్పాల్సిన ఏలూరు శాయ్ క్రీడా సెంటర్ ఇన్‌చార్జి, అథ్లెటిక్స్ కోచ్ కె.వినాయకప్రసాద్ పోక్సో కేసులో కూరుకుపోయి ఇప్పటికి ఐదు నెలలు పూర్తయ్యింది. అయితే బెయిల్‌పై వచ్చి తిరుగుతున్న ఆయన కేసు నుంచి బయటపడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఓ క్రీడాకారిణితో వినాయక ప్రసాద్ అసభ్యంగా ప్రవర్తించారన్న కారణంగా విధుల నుంచి శాయ్ ఉన్నతాధికారులు రిపోర్టు ఆధారంగా సస్పెండ్ చేశారు. పోక్సో కేసును పోలీసులు నమోదు చేసిన విషయం తెల్సిందే. 2019 జూన్ మాసంలో విజయవాడ నుంచి ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన వినాయక ప్రసాద్ ఎప్పుడూ సకాలంలో విధులకు రావడం లేదని..స్వీపర్ల జీతాలు కూడా అదనంగా రాసుకుని చేతివాటం ప్రదర్శించే వారనే ఆరోపణలున్నాయి.ఆయనే ఇన్‌చార్జిగా ఉండటంతో ఆయన వచ్చినప్పుడే ఐదారు రోజులకు అటెండెన్సీ రిజిస్టర్‌లో సంతకాలు చేసేవారని అక్కడ విద్యార్థులే ఆరోపిస్తున్నారు. గడిచిన ఐదారేళ్ల నుంచి అథ్లెటిక్స్‌లో శాయ్ విద్యార్థులకు పతకాలు ఏ మాత్రం రాలేదు. సరికాదు.. జాతీ య స్థాయిలో పోటీల్లో పాల్గొనడం కూడా తగ్గిపోయింది. గతంలో పనిచేసిన ఇన్‌చార్జి, అథ్లెటిక్స్ కోచ్ వెంకట సుబ్బారావు పర్యవేక్షణలో పలువు రు అథ్లెట్లు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చా టారు. శాయ్ సెంటర్ తరలిపోకుండా నిలువరిం చగలిగారు. జాతీయ స్థాయిలో దేవరపల్లి ప్రసాద్, కె.దిలీప్‌కుమార్ జాతీయ పతకాలను సాధించి ఉన్నత ఉద్యోగాల్లో నిలిచారు. ఇండియా నుంచి మొత్తం శాయ్‌లో అథ్లెటిక్స్‌లో 40 మంది శిక్షణ పొందుతున్నారు.


వినాయక ప్రసాద్

ఇదిలా ఉండగా పోక్సో కేసులో బెయిల్‌పైనే వినాయకప్రసాద్ బయట తిరుగుతున్నారు. డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచే స్తున్న పంజాబ్‌కు చెందిన సింగ్(హాకీ కోచ్) శాయ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

### గతంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం..

ఓ క్రీడాకారిణితో వినాయక ప్రసాద్ అసభ్యంగా ప్రవర్తించారన్న కారణంగా విధుల నుంచి శాయ్ ఉన్నతాధికారులు రిపోర్టు ఆధారంగా సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా విజయవాడలో పని చేస్తున్నప్పుడు కూడా క్రీడాకారులు తల్లిదండ్రులను ఆసరాగా చేసుకుని రియల్‌ఎస్టేట్ బిజినెస్‌లో వారితో లావాదేవీలు నెరిపించి దాదాపు ఐదారు కోట్లలో ఎగనామం పెట్టారన్న ఆరోపణలున్నాయి. పలు క్రీడా ఈవెంట్లలో బినామీ కాంట్రాక్టర్‌గా అవతారం ఎత్తి అందులో వచ్చిన ఆదాయంతోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగించారన్న ఆరోపణలున్నాయి. మరికొద్ది కాలంలో ఆయన రిటైర్‌మెంట్ కానుండటంతో పోక్సో కేసు నుంచి బయటపడతారా? లేదా అనేది కూడా ఇటీవల చర్చనీయాంశమైంది.



ఆస్పత్రికి వచ్చిన యంత్రాలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు, పారిశుధ్య సిబ్బంది

## ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య పనులకు నూతన కాంట్రాక్టు

» అధునాతన యంత్రాలతో పనులు

ఏలూరు క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, మెడికల్ కళాశాలకు సంబంధించి పారిశుధ్య పనులకు ఆల్ సర్వీసెస్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కాంట్రాక్టు పొందడంతో ఎంఓయూ ఒప్పందాన్ని చేసుకున్నారు. దీంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య పనుల నిర్వహణ కోసం అత్యాధునిక పరిజ్ఞానం కల్గిన యంత్రాలను మంగళవారం ఆసుపత్రిలోని పారిశుధ్య కార్మికులకు అందించారు. వాటి పనితీరును ఆ సంస్థ పీఆర్వో వి.దత్తాత్రేయ(దత్తు) వివరించారు. వాక్యూమ్ క్లీనర్లు 3, హై ప్రెజర్ వాటర్ జట్‌లు 3, మాన్యువల్ స్వీపర్ మిషన్లు 3, హ్యాండ్ స్క్రబ్బింగ్ మిషన్లు 2ను ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు అందించి వాటి పనితీరును వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు ఆదేశాల ప్రకారం ఆసుపత్రి పరిసరాలు, లోపల వార్డుల్లో శుభ్రంగా ఉంచుతామని ఎక్కడా ఎలాంటి అపరిశుభ్రత వాతావరణం లేకుండా 24గంటలు తమ సిబ్బంది అందుబాటులో విధి నిర్వహణలో ఉంటారని ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. రోగుల పట్ల మర్యాదగా నడుచుకోవడమే కాకుండా వారి సూచనల ప్రకారం అవసరమైన పరిశుభ్రత, వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. సూపర్ వైజర్లు వినోద్, కల్యాణ్, నరేశ్, రత్నాకాంత్, లక్ష్మీకాంత్, రమేశ్, అజయ్, ధనుశ్, కృష్ణవేణి, పారిశుధ్య కార్మిక నాయకురాలు పి.విజయ, వై.ప్రభావతి ఉన్నారు.

# పోయిందనుకున్న బ్యాగు దొరికింది..


జ్యోతికి బ్యాగు అందజేస్తున్న పోలీసులు

భీమవరం క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణానికి చెందిన చనపాక జ్యోతి అనే మహిళ గత నెల 27న ద్విచక్ర వాహనంపై వెళ్తూ బ్యాగును పోగొట్టుకున్నారు. అయితే టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజు అటువైపుగా వెళ్తుండగా బ్యాగును గుర్తించారు. ఆ బ్యాగు లోపల తెరిచి చూడగా కాసున్నర బంగారం, రూ.60 వేల నగదు ఉన్నాయి. దాంతో పాటు బ్యాంకు పాస్ బుక్ కూడా ఉండటంతో పాస్ బుక్ ద్వారా బాధితురాలి వివరాలు గుర్తించి మంగళవారం చనపాక జ్యోతికి సీఐ కాళీచరణ్ చేతుల మీదుగా బ్యాగును అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, రైటర్ భూషణం ఉన్నారు. పోగొట్టుకున్న బ్యాగును అందజేసిన పోలీసుల కు జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.

## చెక్ బౌన్స్ కేసులో..
# ఆరు నెలల జైలు

ఏలూరు క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఓ మహిళకు 6 నెలలు జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఏలూరు వన్‌టౌన్ పడమర వీధి గాంధీ మైదానానికి చెందిన ఉప్పాల అనూరాధ అనే వివాహిత కుటుంబ అవసరాల నిమిత్తం 2022 మే నెలలో ఏలూరుకు చెందిన మేడపాటి సుధాకరరెడ్డి వద్ద రూ.9 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఆ అప్పు తీర్చే క్రమంలో 2023 మే నెలలో రూ.6.50 లక్షల రూపాయల చెక్కును సుధాకర్‌రెడ్డికి ఇవ్వగా ఆయన ఆ చెక్కును బ్యాంకులో వేశారు. బ్యాంకు ఖాతాలో డబ్బు లేనందున ఆ చెక్కు బౌన్స్ అయ్యింది. దీంతో బాధితుడైన సుధాకరరెడ్డి కోర్టును ఆశ్రయించి కేసు వేశారు. ఏలూరు స్పెషల్ మొబైల్ కోర్టులో మంగళవారం కేసు తుది విచారణ చేపట్టిన న్యాయమూర్తి చెల్లని చెక్కు ఇచ్చిన నేరం రుజువైనందున నిందితురాలు ఉప్పాల అనూరాధకు 6 నెలలు జైలు శిక్ష విధించారు. దీంతో పాటు రూ.6.50 లక్షలు చెల్లించాలంటూ తీర్పునిచ్చారు. బాధితుడి పక్షాన న్యాయవాది ఏవీఎస్ సూర్యారావు తమ వాదనలు వినిపించారు.

## విద్యుదాఘాతానికి ఒకరి మృతి

చింతలపూడి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచనగూడెం గ్రామానికి చెందిన మానేపల్లి రవి(40)విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దేశవరంలో ఒక పొలంలో నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలినట్టు సమాచారం. ఆ సమయంలో అక్కడ రక్షించేవాళ్లు ఎవ్వరూ లేకపోవడంతో మృత్యువాతపడ్డాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీకి ఉత్తమ స్వచ్ఛాంధ్ర అవార్డు

ఏలూరు క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖకు జిల్లా స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు దక్కడం సంతోషంగా ఉందని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వి ప్రసాద్ తెలిపారు. డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా మూడవ శనివారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నందుకు గాను కలెక్టర్ కె వెట్రిసెల్వి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ వలంటీర్లకు, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు అందరికి ప్రసాద్ అభినందనలు తెలిపారు.



## చోరీల నివారణకు రద్దీ ప్రదేశాల్లో తనిఖీలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో నేరాలు అధికంగా జరిగే అవకాశాలు ఉన్నందున, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించే దిశగా ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు సీఐ ఎం.వి.సుభాష్ అన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా మంగళవారం ఆర్టీసీ బస్టాండులో తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల రవాణా, చోరీల నివారణకు ఈ తనిఖీలు ఎంతగానో ఉపయోగపడతాయని సీఐ సుభాష్ తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్.ఐ. ఎస్.కె.జబీర్, సిబ్బంది పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వల్ల జీవితం నాశనం : ఏఎస్పీ



ఏలూరు క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల వాడకం వల్ల జీవితం నాశనం అయిపోతుందని విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని ఏలూరు జిల్లా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు సూచించారు. ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో వట్లూరులోని సర్‌సిఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో డ్రగ్స్ వద్దు బ్రో అంటూ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలూరు త్రి టౌన్ సీఐ వి కోటేశ్వరరావు, ఈగల్ ఆర్ఎస్ఐ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

## గాజాలో మారణకాండను వెంటనే నిలిపివేయాలి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గాజాలో గత రెండేళ్లుగా ఇజ్రాయేల్ సాగిస్తున్న మారణకాండను వెంటనే నిలిపియాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలో ముస్లిం జేఏసీ సభ్యులతో కలిసి భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు ధర్ముల సురేశ్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్, ముస్లిం జేఏసీ సభ్యుడు షేక్ ముస్తఫా మాట్లాడుతూ అమెరికా సహకారంతో ఇజ్రాయేల్ దేశ ప్రధాని నెతన్యాహు రెండేళ్లుగా ఎంతో మంది అమాయకుల ప్రాణాలు తీస్తున్నారన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్, పి.శ్రీనివాస్, కారం రాఘవ, కె.వి. రమణ, ఎం.శ్రీనివాస్, వెట్టి భారతి, న్యాయవాది యు.ఏసు బాబు, ముస్లిం జేఏసీ సభ్యులు షేక్ నజీర్ అబ్దుల్ షాహి, షేక్ బాజీ, ఎండీ షహీన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మద్దాల ప్రసాద్ పాల్గొన్నారు.

## రైతు సంఘం మండల మహాసభ

నిడమర్రు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కవులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం నిడమర్రు మండల రైతు సంఘం మండల మహాసభ భువనపల్లిలో నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కవులు శ్రీనివాస్ మాట్లాడుతూ కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలన్నారు. సమావేశంలో నిడమర్రు మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా వెలగలేటి మోహన్, కార్యదర్శిగా లావేటి సోంబాబు, ఉపాధ్యక్షులుగా సంకు కోటసత్తిబాబు, సహాయ కార్యదర్శిగా వలుపు ఏసు ఎన్నికయ్యారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే మా అజెండా : చింతమనేని

పెదవేగి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే అజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో మంగళవారం పలు గ్రామాల ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించారు. ప్రజల సమస్యలను విన్న ప్రభాకర్ సంబంధింత శాఖాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి అనువుగా చర్యలు తీసుకున్నారు. ఎవ్వరైనా సమస్యలను విన్నవించుకునేందుకు నేరుగా తనవద్దకు రావచ్చన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం కోసం బాలుడి నిరసన



బుట్టాయగూడెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): హైకోర్టు చెప్పిన విధంగా తనకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ కుంజా ప్రణీత్(14) మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్ష చేపట్టాడు. బాలుడికి కేవీపీఎస్ నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్, కుటుంబ సభ్యులు మద్దతు తెలిపారు. ఫ్రాన్సిస్ మాట్లాడుతూ బాలుడికి ఎస్టీ కుల ధృవీకరణ పత్రం ఇవ్వాలని హైకోర్టు, కలెక్టర్, ఆర్డీవోలు రెండేళ్లుగా ఆదేశాలిస్తున్న బుట్టాయగూడెం రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. ఐటీడీఏకు వచ్చిన ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసి బాలుడికి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

## సంపూర్ణ అవగాహనతోనే ఆరోగ్యం పదిలం

పెదవేగి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అవగాహనతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ అమర్ అన్నారు. ప్రజలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. పెదవేగి పీహెచ్‌సీలో మంగళవారం ఆశాడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అమర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొనాలంటే వ్యాధుల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలు, మంచి అలవాట్లు కలిగి ఉండాలని, ఈ విషయంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన సూచించారు. సీహెచ్‌వో మంగ, పీహెచ్ఎన్ నాగమణి, హెచ్‌వీలు యామిని, సుజాత, వైద్య సిబ్బంది రమేశ్, వేణు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## 11న ఎంటీఎస్ టీచర్ల విజ్ఞాపన సభ

ఏలూరు అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కనీస వేతన స్కేలుపై పనిచేస్తున్న ఎంటీఎస్ టీచర్లను(డీఎస్సీ-1998) రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ధర్నా చౌక్‌లో ఈ నెల 11న నిర్వహించనున్న విజ్ఞాపన సభకు జిల్లా నుంచి ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఎంటీఎస్ టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్, జిల్లా నాయకులు బేబీసరోజిని, మేరీగ్రేస్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మొత్తం 4,072మంది ఎంటీఎస్(డీఎస్సీ-98)టీచర్లు పనిచేస్తున్నారని,వీరంతా ఉద్యోగ విరమణ వయస్సుకు సమీపంలోఉండగా పోస్టింగ్‌లు ఇవ్వడంతో కొద్దిరోజులకే రిటైరవ్వాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఏ ఉద్యోగీ నష్టపోని విధంగా డీఎస్సీ-1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు అన్ని విధాలా నష్టపోయినందున ప్రభుత్వం మానవతాదృక్పథంతో స్పందించాలని అభ్యర్థిస్తూ విజ్ఞాపన సభను నిర్వహిస్తున్నామని సంఘ జిల్లా నాయకులు స్వామిదాస్, కరుణ, రాజు, భాషా, బాజి వివరించారు.

## పెదవేగి ఎంఈవోపై విచారణకు డీఈవో ఉత్తర్వులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయునికి జీతం చెల్లించకుండా వేధిస్తున్నారనే అభియోగాలపై జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు పెదవేగి ఎంఈవో-1పై విచారణకు కమిటీని ఏర్పాటుచేస్తూ డీఈవో వెంకటలక్ష్మ్మ ఉత్తర్వులు జారీ చేశారు. పెదవేగి మండలం రామచంద్రాపురం జడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న పీఎస్ హెచ్ఎం కృష్ణకు జూలై జీతం బిల్లు చేయకుండా ఎంఈవో-1 వేధిస్తున్నారంటూ జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఆగస్టులో ఫిర్యాదుచేశారు. కృష్ణ ఫిర్యాదు మేరకు కలెక్టర్, డీఈవోలకు కమిషన్ నోటీసులు జారీచేస్తూ పదిరోజుల్లో విచారణ జరిపి నివేదికను అందజేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో విచారణాధికారులుగా ఏలూరు డీవైఈవో రవీంద్రభారతి, దెందులూరు ఎంఈవో-1 ప్రసాద్‌లను నియమించింది. ఈ నెల 12లోగా నివేదిక అందజేయాలని డీఈవో కోరారు.

## నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి, శరీర దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి విద్యార్థులకు క్రీడలు దోహదపడతాయి. చదువుతోపాటు వారికిష్టమైన క్రీడాపోటీలకు ప్రభుత్వం ప్రతీ ఏటా నిర్వహిస్తోంది. ఈ నెల 8 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు ప్రారంభం కానున్నాయి. మండల, స్థాయిలో నిర్వహించేందుకు అధికారులు మైదానాలు సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఎస్‌జీఎఫ్ పోటీలు చక్కని వేదిక. మండల స్థాయిలో ఆటల్లో పోటీల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు కార్యాచరణ సిద్ధం చేశారు. బుధవారం శనివారపుపేట జడ్పీ హైస్కూల్లోనూ, తొమ్మిదో తేదీన ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఎంపిక పోటీలు వివిధ విభాగాల్లో నిర్వహిస్తారు. కబడ్డీ, ఖోఖో వాలీబాల్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చదరంగం, నెట్‌బాల్, టెన్నికాయిట్, యోగా ఇతర అంశాల్లో పోటీలు నిర్వహించి మండల స్థాయి జట్లను ఎంపిక చేయనున్నారు.



పెదవేగి, కుక్కునూరు, చింతలపూడిలోని పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

# మాపై అంత నిర్లక్ష్యమెందుకు?

### పీహెచ్‌సీలు, ఆస్పత్రుల వద్ద ఆశా కార్యకర్తల ధర్నాలు - సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

చింతలపూడి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవాపురం, ఎర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆశా వర్కర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌సీల వద్ద కొద్దిసేపు నినాదాలు చేసి ప్రదర్శన జరిపారు. సీఐటీయూ నాయకులు ముత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని తమ యూనియన్ మద్దతు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం పీహెచ్‌సీల్లో మెమోరాండాన్ని అధికారులకు అందజేశారు. సంఘ నాయకురాళ్లు పుష్పరాణి, పుణ్యవతి, సరళ, అశ్విని, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

● కుక్కునూరు: ఆశ వర్కర్లకు కనీసవేతనం అమలు చేసి పనిభారం తగ్గించాలని సీఐటీయూ మండల కన్వీనర్ వై.సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కుక్కునూరు, అమరవరం ప్రభుత్వ ఆసుపత్రుల ముందు ఆశా వర్కర్లు ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఆశా యూనియన్ నాయకులు కే.బాపనమ్మ, కుమారి, నాగమణి, సునీత, సరస్వతి, సరోజిని, ఆదమ్మ పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్యసేవలందిస్తున్న ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు స్థానిక ప్రాథమిక ఆరగ్యో కేంద్రం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఏపీ ఆశావర్కర్ల సంఘం మండల కమిటీ అధ్యక్షుడు యలమంచిలి విజయలక్ష్మి మాట్లాడుతూ పెరుగుతున్న పని భారంతో పాటు చాలీచాలని వేతనాలతో ఆశావర్కర్లు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు అలుమోలు మురళీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● పెదవేగి: తమ సమస్యలు పరిష్కరించాలని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఆశా కార్యకర్తల సంఘం పెదవేగి మండల శాఖ అధ్యక్షురాలు రోజా మాట్లాడుతూ 20 ఏళ్లగా తాము ప్రజలకు సేవలు చేస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని, ఇటీవల పని భారం మరింతగా పెంచారని, వేతనాలు మాత్రం పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీలో వినతిపత్రం అందించారు. ఆశా కార్యకర్తలు మౌనిక, భారతి, నిర్మల కుమారి పాల్గొన్నారు.

## పెదవాగు గండిని పూర్తి చేయండి

బుట్టాయగూడెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ముంపు మండలమైన ఏలేరుపాడు మండలంలోని పెదవాగు ప్రాజెక్టుకు పడిన గండిని వెంటనే పూర్తిచేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్‌కు విన్నవించారు. మంగళవారం కె.ఆర్.పురం ఐటీడీఏలో ఆయనకు సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి ఎస్.కె.గౌస్ కలిసి వినతిపత్రం అందజేశారు. 2022లో వచ్చిన వరదల దృష్ట్యా మండలాన్ని యూనిట్‌గా తీసుకుని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, పోడుదారులకు పట్టాలివ్వాలని, మేడేపల్లి నుంచి వసంతవాడ వరకు పెదవాగు పరివాహక ప్రాంతాల గ్రామాల్లో త్రీ ఫేజ్ కరెంట్ లైన్ ఏర్పాటుచేసి మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఐటీడీఏలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలిప్పించాలని కోరుతూ ఇతర సమస్యలపైన వినతులను అందజేశారు. రెడ్డిగూడెం కొండ రెడ్ల, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు. భూములు లాక్కుని అధికారులు తమపై కేసులు పెట్టారని ఫిర్యాదు చేయగా హుస్సేన్ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి విషయాలను జాతీయ ఎస్టీ కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందని, బాధితులకు న్యాయం చేస్తామన్నారు. నాయకులు కాకి మధు, కుంజా శ్రీను, వంతల నాగేశ్వరావు, తెల్లం లక్ష్మణరావు, రవ్వ బసవ రాజు కొండరెడ్లు పాల్గొన్నారు.



ఎస్టీ కమిషన్ సభ్యుడికి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

## ప్రజాస్వామ్య విలువలకు బీజేపీ తిలోదకాలు

### మాజీ ఎంపీ జేడీ శీలం



ప్లకార్డులు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్తంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాసామ్య విలువలకు తిలోదకాలిస్తూ ప్రజా స్వామ్యాన్ని అవమానిస్తూ ప్రజల ఓట్లను దోచుకుని మూడోసారి గద్దెనెక్కిందని, ఓటరు జాబితాల్లో అనేక అవకతవకలకు పాల్పడి లేని ఓట్లను ఉన్నట్టుగా చూపించి ఉన్న ఓట్లను తొలగించి బీజేపీ ఓట్ చోరీకి పాల్పడిందని మాజీ ఎంపీ, ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం, ఏఐసీసీ జాయింట్ కార్యదర్శి డాక్టర్ పాలక్‌వర్మలు పేర్కొన్నారు. ఏలూరు అగ్రహారంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఓట్ చోరీకి సంబంధించిన ప్లకార్డులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజమైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా వారికి నచ్చిన నాయకులను ఎన్నుకునే అధికారాన్ని కోల్పోయారన్నారు. ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుగా పొందాలనేదే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, కాంగ్రెస్ నేతలు ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, రాష్ట్ర నాయకులు ఉన్నమట్ల ఎలీజా ఉన్నారు. ఈ సందర్భంగా జె.డీ.శీలం, పాలక్‌వర్మలు జిల్లాలోని కాంగ్రెస్ నేతలకు దిశ, నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం చేయాల్సిన అంశాలపై సుదీర్ఘంగా శిక్షణ ఇచ్చారు.

## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి దుర్మార్గం

టి.నర్సాపురం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై సనాతన ధర్మం పేరుతో మతోన్మాది దాడి చేయడం దుర్మార్గమైన చర్యగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి అభివర్ణించారు. సీజేఐ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఏఎస్ఆర్ నగర్ వద్ద మూడు రోడ్ల కూడలిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.సుప్రీంకోర్టు జడ్జిపై ఆర్ఎస్ఎస్ దాడిని ఖండించాలని నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ దేశంలో సుప్రీంకోర్టు సీజేఐపై దాడి ముమ్మాటికి రాజ్యాంగంపై దాడని అన్నారు. బీజేపీ అనుబంధ ఆర్ఎస్ఎస్‌లు సనాతన ధర్మంపేరుతో వారిని వ్యతిరేకించిన వారిపై దాడి చేయడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులకు అలవాటుగా మారిందన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి తెగబడటం అంటే భారత దేశంలో సామాన్య ప్రజలకు రక్షణ ఏముంటుందని ప్రశ్నించారు. ఈ దాడిని ప్రజలంతా ఖండించాలన్నారు. ఐద్వా నాయకురాలు శ్యామలరాణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుడెల్లి వెంకట్రావు, మండల నాయకురాలు మడకం సుధారాణి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

## జీఎస్టీ సంస్కరణలపై విద్యార్థులకు అవగాహన



కె.కోటలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కామవరపుకోట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపల్ కె.విజయబాబు సూచనలతో విద్యార్థులు, అధ్యాపకులు జీఎస్టీ సంస్కరణల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీ సంస్కరణలను తెలియచేసే ప్లకార్డులను ప్రదర్శించారు. ఏ విభాగంలో ఎంత మేరకు ప్రజలకు ప్రయోజనం కలుగుతుందో వివరించి ప్లకార్డులను ప్రదర్శించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు, జీఎస్టీ ప్రాముఖ్యత, రకాలు, భారత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం గురించి వివరించారు. అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, దారవత్ మల్లేష్, బి.రాజు, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలోని కలరాయనగూడెంలో జడ్పీహెచ్ స్కూల్లో విద్యార్థులకు ఎంఈఓ కె.రామారావు ఆధ్వర్యంలో జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధారిత ఉత్పత్తులు, పరికరాలపై జీఎస్టీని తగ్గించడం వలన రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఎంఈవో-2 రవీంద్ర, హెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● పెదపాడు: విద్యార్థి దశ నుంచే జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలని జీఎస్టీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. పెదపాడు మండలం వట్లూరు హైస్కూల్లో జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీఎస్టీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో సంస్కరణలు తెచ్చిందని విద్యా సామగ్రిపై జీఎస్టీ పూర్తిగా తొలగించారన్నారు.జీఎస్టీ తగ్గుదలతో పేదవర్గాల కొనుగోలు శక్తి పెంపొందుతుందన్నారు. జీఎస్టీ అధికారులు గోపాలకృష్ణ, ప్రమీల, ఎంపీడీవో ఇందిరా, ఎంఈవో నరసింహామూర్తి, హెచ్.ఎం. ఆదిలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ సౌజన్య పాల్గొన్నారు. పెదపాడు హైస్కూల్లోనూ జీఎస్టీపై అవగాహన కల్పించి పలు పోటీలు నిర్వహించారు.

### ● నారా రామ్మూర్తి నాయుడుకు నివాళులు



ద్వారకాతిరుమల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు సంస్మరణ సభను పురస్కరించుకుని ద్వారకాతిరుమలకు చెందిన యువ టీడీపీ నేత మొగతడకల ఓంప్రకాశ్ చౌదరి ఆయన చిత్రపటం వద్ద మంగళవారం నివాళులర్పించారు. నారావారిపల్లి గ్రామానికి వెళ్లి రామ్మూర్తినాయుడు కుమారుడు, తన స్నేహితుడైన నారా రోహిత్‌ను పలకరించారు.

## 9, 10 తేదీల్లో మండల స్థాయి క్రీడలు

చింతలపూడి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండల స్థాయి క్రీడలు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 9,10 తేదీల్లో ప్రభుత్వ హైస్కూల్లో అండర్-14, 17 బాలబాలికల విభాగంలో కోకో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని, అన్నియాజమాన్య పాఠశాలలు పాల్గొనవచ్చని స్కూల్ గేమ్స్ మండల కో-ఆర్డినేటర్ పి.వేణు తెలిపారు. విద్యార్థులు పాఠశాలలో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

### రాష్ట్ర స్థాయికి క్రీడాకారులు..

కామవరపుకోట: ఎస్‌జీఎఫ్‌ఐ తైక్వాండో ఎంపికలు ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించగా కామవరపుకోట మండలం తూర్పుయడవల్లి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం కోటేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రవిలు తెలిపారు. టెన్త్ చదువుతున్న ఎం.హేమంత్(41-45), జి.వెంకటేశ్వరరావు(45-48) బరువు కేటగిరీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వారు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం యడవల్లి హైస్కూలు వద్ద అభినందించారు.



అవార్డును అందుకుంటున్న కమిషనర్ రమణ

## జంగారెడ్డిగూడేనికి ఐదు స్వచ్ఛ అవార్డులు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 2025 స్వచ్ఛాంధ్ర అవార్డుల్లో జంగారెడ్డిగూడేనికి ఏలూరు జిల్లా పరిధిలో పలు విభాగాల్లో 5 అవార్డులు దక్కాయి.ఉత్తమ పారిశుధ్య నిర్వహణకు జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు పొందగా మున్సిపల్ కమిషనర్ కె.వి. రమణ, ఇన్చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ సోమవారం ఏలూరులో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు కార్పొరేషన్ మేయర్ నూర్జహాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అలాగే ఉత్తమ పారిశుధ్య కార్మికురాలిగా దోసూరి మంగమ్మ, పట్టణానికి చెందిన ఇందిరా క్రాంతి పథం ఎస్‌హెచ్‌జి గ్రూపు మహిళలు కిచెన్ వేస్ట్‌తో ఎరువు తయారు చేసినందుకు అవార్డు పొందారు. అలాగే ఫ్యాక్టరీల విభాగంలో స్థానిక నవభారత్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఉత్తమ పారిశుధ్య నిర్వహణలో భాగంగా అవార్డు పొందగా, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కూడా ఉత్తమ పారిశుధ్య నిర్వహణలో కలెక్టరు నుంచి అవార్డు అందుకున్నారు.



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు హేమలత

## 185 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

దెందులూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నేత్ర సంబంధిత వ్యాధుల పట్ల అశ్రద్ధ వహించవద్దని రవి కిరణ్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ హేమలత అన్నారు. మంగళవారం పోతునూరు సొసైటీ ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బ్యాంక్ అధ్యక్షుడు మోహన్ బాబు, పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌లతో కలిసి ప్రారంభించారు. నేత్ర సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలని వైద్యులు హేమలత సూచించారు. ఉచిత వైద్య శిబిరంలో 185 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 34 మందికి కళ్ల అద్దాలు అందించారు. 22 మందికి కంటి ఆపరేషన్లకు రిఫర్ చేశారు. నీటి సంఘం అధ్యక్షుడు చలసాని రాంబాబు, గండి రాజా పాల్గొన్నారు.

## అభాగ్యులకు ఆహారం పంపిణీ

ఏలూరు రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో భాగంగా రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బీఎస్ఎన్ఎల్ కమ్యూనికేషన్ డైరెక్టర్ సి.హెచ్.జాన్ వెస్లీ అన్నార్తులకు, అభాగ్యులకు, బిక్షకులకు మంగళవారం ఆహారం పంపిణీ చేశారు. సంపాదనలో కొంత భాగం ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు.

## ఘనంగా అన్నదానం

పెదపాడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద దాత కాళ్ల మల్లికార్జున రావు, కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో సుమారు 350 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. మంగళవారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

దెందులూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):ఆటో డ్రైవర్లకు అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్టు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేలు అందించిన నేపథ్యంలో శ్రీచక్ర ఆటో యూనియన్ అధ్యక్షులు ఎం.శ్రీను, ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి, అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బ్యాంక్ అధ్యక్షుడు బోడేటి మోహన్ బాబు, పార్టీ అధ్యక్షుడు నున్న లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు.

## కేన్సర్‌పై అవగాహన

దెందులూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళల్లో వచ్చే రొమ్ము కేన్సర్‌పై ఆశ వర్కర్లు అవగాహన కల్పించాలని గోపన్నపాలెం ప్రభుత్వ ఆస్పత్రి ఎంపీహెచ్‌వో కేతా సత్యనారాయణ అన్నారు.మంగళవారం గోపన్నపాలెం పీహెచ్‌సీలో రొమ్ము కాన్సర్‌ను ఎలా గుర్తించాలనే దానిపై ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి పీహెచ్ఎన్ తంగెళ్ల సత్యవతి మాట్లాడుతూ మహిళలకు వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన అవసరమని అన్నారు. ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిడమర్రు ఎస్ఐగా రమేశ్



నిడమర్రు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నిడమర్రు మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఎస్.వి. వి.రమేశ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టిన వీరప్రసాద్ ఏలూరు వి.ఆర్‌కు బదలీపై వెళ్లారు. ఎస్.ఐ.గా బాధ్యతలు చేపట్టిన రమేశ్ రాజమండ్రి స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ పనిచేసి నిడమర్రుకు బదలీపై వచ్చారు. గతంలో పెనుగొండ, పెనుమంట్ర, తాడేపల్లిగూడెంలో పనిచేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమేశ్‌కు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. ఆయనకు స్థానిక జనసేన, తెలుగుదేశం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.




## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతలపూడి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నలుగురికి వచ్చిన 2.63 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అందజేశారు.కూటమి నాయకులు మధుబాబు, మాటూరి అనీల్ పాల్గొన్నారు.

## గౌరీ శంఖర హాలు ప్రారంభం

దెందులూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం పోతునూరు గ్రామంలో వెంకటలక్ష్మీ ట్రేడర్స్ శ్రీసూర్య రైస్ మిల్ అధినేత బొడ్డేటి సత్యనారాయణ సొంత నగదు రూ.6 లక్షలతో నిర్మించిన గౌరీ శంఖర సేవా సంఘం కమిటీ హాలును ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. పోతునూరు సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ బాబు, పార్టీ గ్రామాధ్యక్షుడు నున్న లక్ష్మణ్, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, బొడ్డేటి సత్య బాలాజీ, రాజేంద్ర ప్రసాద్, కాళ్ల హరి బాబు, అప్పారావు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న నరసింహారావు

## హైమావతి క్లబ్‌కు ఉత్తమ అవార్డు

ఏలూరు రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఐసీఐ హైమావతి క్లబ్‌కు ఉత్తమ సేవా అవార్డు లభించింది. మంగళవారం విజయవాడలో జరిగిన ఎన్‌డీసీ కార్యక్రమంలో ఈ అవార్డును క్లబ్ అధ్యక్షుడు ఎంఎల్ నరసింహారావు అందుకున్నారు. ఈ అవార్డు రావడం పట్ల క్లబ్ సభ్యులు, నగర ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## 10న విద్యుత్ వినియోగదారుల అదాలత్

నూజివీడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల అదాలత్ ఈ నెల 10వ తేదీన నూజివీడు జీపీ గ్రాండ్‌లో నిర్వహిస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఏడీఏ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరెంట్ బిల్లులు, నూతన మీటర్లకు సంబంధించి సమస్యలను అదాలత్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

## రేపు రీ సర్వేపై గ్రామసభ

చాట్రాయి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగూడెంలో 9వ తేదీ ఉదయం 10 గంటలకు నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అధ్యక్షతన రీసర్వే గ్రామసభ జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరరావు తెలిపారు. కొత్తగూడెంలో గతంలో జరిగిన భూముల రీసర్వేలో తప్పులు దొర్లినట్టు రైతుల నుంచి అభ్యంతరాలు రావటంతో ఈ గ్రామసభ ఏర్పాటు చేశారని, రైతులు హాజరై తమ రీసర్వే సమస్యలు అర్జీల రూపంలో అందజేయాలని కోరారు.




## ఘనంగా వాల్మీకి జయంతి

ముసునూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి జ్ఞాన జ్యోతిని చూపించిన కారుణ్యమూర్తి వాల్మీకి మహర్షి అని ఎంపీడీవో పిల్లి ఏసుబాబు అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో బీఏ సత్యనారాయణ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీనియర్ అసిస్టెంట్ సగ్గుర్తి శ్రీనివాసరావు, ఏవో డి.ఛాయాదేవి, కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, కె.ధర్మావతి తదితరులు పాల్గొన్నారు.



నాగాభరణాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కామినేని, దాత కొండరాజు

## కనకలింగేశ్వరుడికి వెండి నాగాభరణం అందజేత

కైకలూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో కొలువైయున్న కనకలింగేశ్వరస్వామికి 3 కేజీల వెండి నాగాభరణాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చేతులమీదుగా అందజేశారు. మంగళవారం భుజబలపట్నం గ్రామానికి చెందిన ముదునూరు కొండరాజు, వెంకట లక్ష్మీ దంపతులు వారి కుమారుడు మధువర్మ, దుర్గాప్రసన్న దంపతులు ఈ నాగాభరణాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. నాగాభరణాన్ని విశేష పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారంతోనే ఆలయాల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పూల రామచంద్రరావు, వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు, వైస్ ఎంపీపీ రామకృష్ణ, టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు, ఉత్సవ కమిటీ సభ్యుడు జంపన రామలింగరాజు, ఎన్టీఆర్ యువసేన నాయకుడు లక్కింశెట్టి మోహన్, ఈవో వీఎన్‌కె శేఖర్ పాల్గొన్నారు.

## వాటర్ స్పోర్ట్స్‌లో వడాలి క్రీడాకారుడికి కాంస్యం



ముదినేపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ వాటర్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో జరిగిన ఛాంపియన్ షిప్ పోటీల్లో ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన లంకపల్లి లక్ష్మీనరసింహారావు కాంస్య పతకం సాధించాడు. పారా కనో విభాగంలో బోటింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించటంతో అతనికి ఈ పతకం దక్కింది. ఈ యువకుడు 200 మీటర్ల బోటింగ్ పోటీల్లో తన ప్రతిభను కనబర్చినందుకు ఈ క్రీడాకారుడికి ఏపీ కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బి.బలరామ్ నాయుడు వాటర్ స్పోర్ట్స్ వ్యవస్థాపకుడు టి.శివారెడ్డి కాంస్య పతకాన్ని అందజేసి అభినందించారు.



## స్కూల్ గేమ్స్‌లో త్రివిధ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో నూజివీడు త్రివిధ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు త్రివిధ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖోఖో విభాగంలో తమ పాఠశాల నుంచి నలుగురు, కబడ్డీ విభాగంలో నలుగురు, బ్యాడ్మింటన్‌లో ఇద్దరు, వాలీబాల్ విభాగంలో ఆరుగురు, యోగ విభాగంలో ఒక్కరు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నేతలు

## అసత్య ఆరోపణలు చేస్తే న్యాయ పోరాటం తప్పదు

మండవల్లి(కైకలూరు), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కొన్ని పత్రికలను అడ్డం పెట్టుకుని అవాస్తవాలు రాయించి దుష్ప్రచారం చేయడం వైసీపీ నేతలు దిగజారుడుతనానికి నిదర్శనమని కూటమి పార్టీల మండల అధ్యక్షులు నారగాని నాగేశ్వరరావు, బోయిడి సురేష్‌బాబు, బి రాజేష్ ఆరోపించారు. మంగళవారం మండవల్లిలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి నేతలు ఎంతో హుందాగా కష్టంలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటున్నారని అలాంటి వారిపై వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేయడం హేయమన్నారు. ఇది పునరావృతం అయితే ఆ పత్రికలపై న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. కూటమి నాయకులు గుడివాడ చిట్టిబాబు, ప్రసాద్, గొల్లంపల్లి కృష్ణారావు, చదలవాడ శ్రీమన్నారాయణ, కూనపురెడ్డి కోటేశ్వరరావు, ముళ్లపూడి సత్తిబాబు, పెద్దఎత్తున ఇతర నాయకులు పాల్గొన్నారు.

## బాణసంచా గోడౌన్ల తనిఖీ

నూజివీడు టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అనధికారిక బాణసంచా నిల్వలుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ హెచ్చరించారు. నూజివీడులోని బాణసంచా తయారీ గోడౌన్లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. గోడౌన్‌లకు రక్షణ ఏర్పాట్లను చేయాలన్నారు.

| బ్రాయిలర్ ధరలు | |
|---|---|
| అమరావతి | (రూ.లలో) |
| బ్రాయిలర్ బర్డ్ | 127, 136, 147 |
| చికెన్ విత్ స్కిన్ | 242 |
| చికెన్ స్కిన్‌లెస్ | 252 |
| నెక్ కోడి గుడ్డు ధర (100) | |
| విజయవాడ జోన్ రైతు ధర రూ.475 | |



## వేద ఘోషతో మార్మోగిన కైకలూరు

కైకలూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వేద ఘోషతో కైకలూరు పట్టణం మార్మోగింది. మంగళవారం కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో వేదసభను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఘనాపాఠీలు, వేదపండితులతో వేద విద్వత్ సభ నిర్వహించారు. వీరంతా ముందుగా కైకలూరుకు చెందిన సీనియర్ న్యాయవాది గొర్తి ప్రభాకర దీక్షితులు ఇంటి నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం వేదసభ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌కె శేఖర్, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహించారు.

# ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ గిరిజనుల ఆందోళన



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషన్ సభ్యుడు, కలెక్టర్

బుట్టాయగూడెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో ఆయుధ డిపో నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం డిపో వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులు వివిధ రకాల పంటలను చేతపట్టుకుని కేఆర్ పురం ఐటీడీఏ ఎదుట ఆందోళన చేశారు. డిపో ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని రెండు పంటలు పండే భూముల్లో మాత్రమే వ్యతిరే కిస్తున్నామని, డిపోను ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేయాలని సాగులో ఉన్న వంకవారిగూడెం భూముల్లో వద్దని ఆందోళనకారులు తెలిపారు. ఏజెన్సీ పర్యటనలో ఉన్న జాతీయ ఎస్టీ కమిషన్ మెంబరు హుస్సేన్ నాయక్ ఆందోళనకారులతో మాట్లాడారు. డిపో ఏర్పాటుకు పీసా గ్రామసభ అనుమతి లేదని, గిరిజనులు వ్యతి రేకిస్తున్నా అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. కమిషన్ సభ్యుడు గిరిజనులకు సర్దిచెప్పారు. డిపోను ఇక్కడ ఆదివాసీలు వ్యతిరేకిస్తున్నందున విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళతానని చెప్పడంతో గిరిజనులు శాంతించారు. పోరాట కమిటీ నాయకులు తెల్లం రామకృష్ణ, మడకం వెంకటేశ్వరావు, తెల్లం దుర్గారావు ఆదివాసీలు పాల్గొన్నారు.

### మౌలిక వసతులు కల్పించండి..

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ ఆదేశించారు. మంగళవారం కేఆర్ పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ చైర్మన్ వెట్రిసెల్వితో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గిరిజనుల కదలికలపై ఆంక్షలు పెట్టవద్దని, గిరిజనులకు మంజూరు చేసిన 26 ఇళ్ళను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

# కమిటీలు బాల్య వివాహాలను నిరోధించాలి : సబ్ కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న నూజివీడు సబ్‌కలెక్టర్ వినూత్న

నూజివీడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నియంత్రణకు గ్రామస్థాయి నుంచి కమిటీలు కఠిన చర్యలు తీసుకోవాలని నూజివీడు సబ్‌కలెక్టర్ వినూత్న ఆదేశించారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహాల నిరోధంపై నూజివీడు డీఎస్పీ కె.వి.ఎస్.వి ప్రసాద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై సబ్‌కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చేనెలలో తిరిగి సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిఒక్క అధికారి సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు. గ్రామాల్లో బాల్యవివాహాల నిరోధం బాలిక విద్య ప్రోత్సాహం పై కమిటీలు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామస్థాయి, మండల స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి క్రియాశీలకంగా ఉండేలా చూడాలన్నారు. మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులతో పాటు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## రైతులకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యం

ముసునూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఉత్తమ సేవలు అందిం చడమే లక్ష్యమని పీఏసీయస్ అధ్యక్షులు దేవినేని శ్రీధర్ అన్నారు. ముసునూరు కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా 22 మంది రైతులకు రూ. 1 కోటి 22 లక్షలు దీర్ఘకాలిక రుణాలకు సంబంధించిన మంజూరు పత్రాలను టీడీపీ నాయకులతో కలిసి శ్రీధర్ రైతులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సొసైటీ ద్వారా రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు, పురుగు మందులను అందిస్తామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డైరెక్టర్లు గోగం కాటంరాజు, చీలి లక్ష్మీ, నాయకులు కొండేటి ఉదయ్ కిరణ్, నక్కా యోహాను, తోట శ్రీనివాసరావు, తుల్లిమెల్లి రంగరావు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత

ఆగిరిపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్లస్2 పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఈదర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మండల టీడీపీ అధ్యక్షుడు నక్కనబోయిన వేణు ఈదర పీఏసీఎస్ చైర్మన్ కోటగిరి మోహన్‌బాబు, సర్పంచ్ దొండపాటి అనిత ఏసుపాదం రూ. 40 వేల నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.




## మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు

కలిదిండి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ టి.రత్న సాయి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలంటే ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలన్నారు. పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురి కాకుండా మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ఇష్టంతో చదవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు అనిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవారి రథోత్సవం

ద్వారకాతిరుమల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని రథరంగ డోలోత్సవం క్షేత్రపురవీధుల్లో మంగళవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం జరిగిన మరుసటి రోజున రథోత్సవాన్ని జరపడం ఇక్కడ సంప్ర దాయబద్ధమైంది. రాత్రి ఆలయంలో ఉభయదేవేరులతో స్వామివారిని తొళక్కం వాహనంపై ఉంచి అలంకరించారు. రథంలో ఏర్పాటుచేసిన సింహాసనంపై కల్యాణ మూర్తులను ఉంచి అలంకరించి హారతు లిచ్చారు. ఆ తరువాత విశేష వాయిద్యాలు, డప్పు వాయి ద్యాలు, కోలాట భజనలు, భక్తుల గోవింద నామాల నడుమ క్షేత్రపురవీధుల్లో తిరుగాడింది.

## విద్యార్థులకు జీఎస్టీ 2.0పై అవగాహన

కైకలూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0లో ధరల తగ్గింపును గమనించి కొనుగోలు చేయాలని ఏలూరు జిల్లా జీఎస్టీ అధికారి సీహెచ్. కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఓరియంటల్ ఉన్నత పాఠశాల, నేషనల్ స్కూల్, ఆక్స్‌ఫర్డ్ మేగ్నెట్ స్కూల్‌లో జీఎస్టీపై 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సును ఎంఈఓ డి. రామారావు అధ్యక్షతన నిర్వహించారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీని 18 నుంచి 5శాతానికి తగ్గించారని వీటిపైన ప్రజలు అవగాహన చేసుకుని వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. ఆయా దుకాణాల్లో రేట్ల వ్యత్యాసాన్ని గమనించి కొనుగోలు చేయాలన్నారు. ధరలు తగ్గించకుండా అమ్మకాలు చేస్తే వెంటనే జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

## దివ్యాంగురాలికి వితరణ

ముదినేపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధికి ఇబ్బంది పడుతున్న ముదినేపల్లి అంబేడ్కర్ కాలనీకి చెందిన దివ్యాంగురాలు గోన మాధవికి స్థానిక 'మేము సైతం మీ కోసం' టీం సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం గుడివాడకు చెందిన దాత గూడపాటి భాను ప్రసాద్ నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బిళ్లపాడుకు చెందిన ఈశ్వరికి కూడా సహాయం అందజేశారు. వీరిద్దరికీ ప్రతి నెలా బియ్యం, నిత్యావసర సరుకులు అందిస్తానని భాను ప్రసాద్ తెలిపారు. టీం సభ్యులు మొవ్వ ఫణీంద్ర, భూపతి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బోదెలోకి దూసుకుపోయిన పాలవ్యాన్

కైకలూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలో పాలవ్యాను అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొని బోదెలోకి దూసుకుపోయిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. విజయవాడ నుంచి విజయా పాలవ్యాన్ భీమవరం వెళుతుండగా కైకలూరు మండలం ఆటపాకలో ఎదురుగా హైటెక్ బస్సు వేగంగా రావడంతో వ్యాన్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోదెలోకి దూసుకుపోయింది. దీంతో విద్యుత్ స్తంభం పూర్తిగా ధ్వంసమై సరఫరా నిలిచిపోయింది. ఎవరికి ఏవిధమైన గాయాలు కాలేదు. మంగళవారం ఉదయం వ్యాన్‌ను యంత్రాల సహాయంతో బయటకు లాగారు. ఈ సంఘటనపై పోలీసుకేసు నమోదు కాలేదు. విద్యుత్‌శాఖ అధికారులు నూతనంగా స్తంభాన్ని వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



## నాగరాజుకు అభినందన

చాట్రాయి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితులైన, ఏలూరు జిల్లా నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజును మంగళవారం చింతలపూడి మండలం పోతునూరులో నూజివీడు నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు రాయవరపు సీతారాములు, పలువురు నాయీబ్రాహ్మణ నాయకులు అభినందించారు. నాయీబ్రాహ్మణ నాయకులు కొప్పాక కొండ, నందిగామ సుబ్బారావు, సురేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చౌక డిపో పెయ్యేరుకు తరలించండి

ముదినేపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పెయ్యేరు గ్రామ చౌక డిపోను శివారు గ్రామ పరిధి నుంచి పంచాయతీ ప్రధాన కేంద్రానికి తరలించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు తహసీల్దార్ లతీఫ్ పాషాకు మంగళవారం పలువురు గ్రామస్థులు మెమొరాండం అందజేశారు. చౌక డిపో గ్రామానికి దూరంగా ఉండటం వల్ల రేషన్ తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, చౌక డిపోను పెయ్యేరు గ్రామానికి మార్చాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యం తీసుకునేందుకు ఒక రోజు కూలి పనులు మానుకోవాల్సి వస్తుందని, వెంటనే డిపోను గ్రామస్థులందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరగా, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు కైకలూరు మండలం పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులందరూ గమనించాలన్నారు.

## రహదారి మరమ్మతులకు నిధులు

కలిదిండి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పెద్ద గోతులు పడి అధ్వానంగా ఉన్న మూల్లంక - పెదలంక రహదారి మరమ్మతులకు రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఆర్అండ్‌బీ ఏఈఈ అరవింద్ తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. మూల్లంక నుంచి పెదలంక వరకు సుమారు 7 కిలోమీటర్ల రహదారి మరమ్మతులు త్వరలో చేపడతామన్నారు.

## పాఠశాలకు సీసీ కెమేరాల వితరణ

చాట్రాయి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బూరుగుగూడెం యూపీ స్కూల్‌కు సీసీ కెమేరాలు అందజేశారు. సీసీ కెమేరాలు అందజేసిన గ్రామ ప్రముఖులు తేళ్ళూరి శేఖర్, రాజబోయిన రామరాజు, కాలసాని సూర్యనారాయణ, ఉయ్యాల దిలీప్ కుమార్‌లను ఎంఈవో-2 వీఎస్‌వీ బ్రహ్మాచారి, హెచ్‌ఎం అభినందించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ బక్కయ్య పాల్గొన్నారు.













